# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 99 | విశాఖపట్నం | 8-1-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 99 | VISAKHAPATNAM | 8-1-2026 THURSDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు అంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్లుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




5లో

**ప్రత్యేక శిక్షణతో రాటుదేలుతున్న కోడి పుంజులు**



6లో

**గుండె ఆరోగ్యంగా ఉండాలంటే..**



7లో

**పర్యాటకులకు సరికొత్త అనుభూతి**

## పోలవరం ప్రాజెక్టు పనులను
# పరిశీలించిన చంద్రబాబు





**పోలవరం, పతాకం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్నారు. సిఎం కు పోలవరం ప్రాజెక్టు హెలిపాడ్ వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి స్వాగతం పలికారు. అంతకుముందు ఏరియల్ విజిట్ ద్వారా పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి స్పిల్ వే సహా మొత్తం ప్రాజెక్టును ముఖ్యమంత్రి పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ సహా ఇతర నిర్మాణాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనలో భాగంగా ౼. ఈరోజు హెలికాప్టర్‌లో 11.30 నిమిషాలకు పోలవరం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు.ముందుగా ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుండి పోలవరం ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీషదేవి, డా. కామినేని శ్రీనివాస్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాలు అందించారు. అదేవిధంగా ఏపీ అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కమిషనర్ పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, ట్రైకార్ చైర్మన్ బరగం శ్రీనివాసులు, ఏపీ భవన నిర్మాణ కార్మిక, ఇతర కార్మికుల సంక్షమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ఎక్స్‌ఆఫీషియో జాయింట్ కలెక్టర్ వి.అభిషేక్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.యం.జె.అభిషేక్ గౌడ, ఆర్డీఓలు యం.అచ్యుత అంబరీష్, యం.వి.రమణ, ఏలూరు ఉడా చైర్మన్ పెద్దిబోయిన వాణీశివ ప్రసాద్, జిల్లా పరిషత్ సీఈఓ యం. శ్రీహరి తదితర అధికారులు హాజరయ్యారు.

## అమరావతిలో రెండో విడత భూ సమీకరణను
# ప్రారంభించిన నారాయణ



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో రెండో విడత భూ సమీకరణ ప్రారంభమైంది. తుళ్లూరు మండలం వడ్డమానులో మంత్రి నారాయణ ఈ ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తుళ్లూరు, అమరావతి మండలాల్లోని (తరువాయి 2వ పేజీలో)

## పరువునష్టం దావా..
## కోర్టుకు హాజరైన మంత్రి లోకేశ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం కోర్టుకు హాజరయ్యారు. సాక్ష దినపత్రిక తనపై ప్రచురించిన ఓ అసత్య కథనంపై ఆయన గతంలో పరువునష్టం దావా వేశారు. ఈ కేసుకు సంబంధించి విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయ స్థానంలో జరుగుతున్న క్రాస్ ఎగ్జామినేషన్ కోసం ఆయన బుధవారం తన న్యాయవాదులతో కలిసి హాజరయ్యారు. 2019 అక్టోబర్ 22న సాక్ష పత్రికలో 'చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఇది పూర్తిగా అవాస్తవమని ఆరోపిస్తూ లోకేశ్ ఈ కేసు దాఖలు చేశారు. ఇప్పటికే ఈ కేసులో రెండుసార్లు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి కాగా, నేడు మూడోసారి ఆయన కోర్టు విచారణకు హాజరయ్యారు.



## సంక్రాంతికి 8,432 ఏపీఆర్టీసీ
# ప్రత్యేక బస్సులు

**అమరావతి, పతాకం న్యూస్:** సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రోజూ నడిచే రెగ్యులర్ సర్వీసులకు అదనంగా 8 వేల 432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ఈసారి స్త్రీశక్తి పథకం దృష్ట్యా రాష్ట్రంలో పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక బస్సుల ఏర్పాటులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. 71 శాతం బస్సులను రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక సర్వీసులుగా నడపాలని నిర్ణయించింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల మధ్య రద్దీ గణనీయంగా పెరిగిన దృష్ట్యా వీటి మధ్య 6 వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు 2 వేల 432 ప్రత్యేక బస్సులుగా నడిపేందుకు కేటాయించింది. పండగ ముందు రోజుల్లో మొత్తం 3857 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

వీటిలో హైదరాబాద్ కు 240, బెంగళూరు 102, చెన్నైకు 15 బస్సులు ఏర్పాటు చేయగా, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 3500 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తిరుగు ప్రయాణానికి మొత్తం 4 వేల 575 బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కు 1800, బెంగళూరు 200, చెన్నై 75 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా వీటిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య నడిపేందుకు 2500 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ బస్సుల్లోని చార్జీనే వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. దూర ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు ఆర్టీసీ తెలిపింది.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### ఆర్థిక వ్యవస్థ

భారతదేశ బీమా రంగంలోకి 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ ప్రతిపాదించిన ఒక చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ఈ మధ్యనే పార్లమెంటులో ఆమోదింపజేసుకుంది. ఇండియా ఆర్థిక వ్యవస్థలో "ప్రధానమైన సంస్కరణలకు" ఇది ప్రారంభం అని ప్రధానమంత్రి ప్రకటించారు. అంటే మన దేశ ఆర్థిక సంస్థలను మరింత ఎక్కువగా ప్రైవేటు రంగానికి, ముఖ్యంగా విదేశీ సంస్థలకు అప్పజెప్పడమే ఈ సంస్కరణల ఉద్దేశం. స్వాతంత్ర్యానంతర కాలంలో ఆర్థిక రంగంలో అనుసరిస్తూ వచ్చిన విధానం నుంచి ఇది తిరుగుదారి పట్టడమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. చాలా కాలంగా ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, అమెరికా ప్రభుత్వం మన దేశ ఆర్థిక విధానంలో ఇటువంటి తిరోగమనాన్ని కోరుకుంటున్నాయి. ఒకవేళ మొత్తం ఆర్థిక సంస్థలన్నింటినీ ఒకేసారి ప్రైవేటుపరం చేయడం వెంటనే సాధ్యపడకపోతే కనీసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నైనా ప్రైవేటుపరం చేసి తద్వారా ప్రభుత్వం ఒక 'సంకేతాన్ని' పంపవచ్చు గదా అని అమెరికన్ ప్రభుత్వం లోని ఒక సీనియర్ అధికారి సలహా కూడా ఇచ్చాడు! కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తున్న కాలంలో, ఆ పార్టీ నయా ఉదారవాద సంస్కరణలకు ఎంత సానుకూలం అయినా, ఇటువంటి చర్చ చేపట్టడానికి సిద్ధపడలేదు. అయితే, భారతీయ కార్పొరేట్ల సేవ చేయడంలో బిజెపి ఎంత వరకైనా తెగించేందుకు సిద్ధం. ఇప్పుడు ఆ కార్పొరేట్ల ప్రయోజనాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రయోజనాలతో మరింత సన్నిహితంగా కలగలిసిపోతున్నాయి. అందుచేత సామ్రాజ్యవాద శక్తులు కోరుకుంటున్న 'సంస్కరణలను' అమలు చేయడానికి, అంటే, ఆర్థిక సంస్థలను ప్రైవేటుపరం చేయడానికి, విదేశీ ఆధిపత్యం కిందకు తీసుకురావడానికి ప్రణాళికలు వేస్తోంది. స్వాతంత్ర్యం సాధించుకున్నాక అప్పటివరకూ విదేశీ పెత్తనం కింద ఉండిన ఆర్థిక సంస్థలను ఆ పెత్తనం నుంచి విముక్తి చేసుకున్నాం. ఇప్పుడు మళ్లీ ఆ విదేశీ పెత్తనం కిందకే వాటిని నెడుతోంది బిజెపి ప్రభుత్వం. ఆనాడు విదేశీ పెత్తం నుంచి బైట పడేయడానికి ఎందుకు పూనుకున్నదీ పరిశీలించడం ఇప్పుడు ఉపయోగకరం. "ఉత్పత్తి"కి, "స్పెక్యులేషన్"కి మధ్య తేడాను విదేశీ పెట్టుబడి చూడదు. ఇంతకూ ఆ రెండింటికీ మధ్య తేడా ఏమిటి? ఒకానొక ఆస్తిని కొనుగోలు చేసేది దానిని 'నిలుపుకోవడం' కోసం అయితే (అంటే, ఆ ఆస్తి ద్వారా కొన్ని ఏళ్ల పాటు ఆదాయం పొందే ఉద్దేశంతో) దానిని "ఉత్పత్తి" కోసం చేసిన కొనుగోలుగా పరిగణిస్తాం. అదే ఒకానొక ఆస్తిని కొనుగోలు చేసేది దానిపై వచ్చే ఆదాయం కోసం కాకుండా, వీలైనంత త్వరగా దానిని మళ్లీ ఎక్కువ ధరకు అమ్ముకుని లాభం పొదే ఉద్దేశంతోనైతే దానిని "స్పెక్యులేషన్" అంటాం. ప్రైవేటు ఆర్థిక సంస్థలు ఈ రెండు రకాల లావాదేవీల మధ్య తేడాతో నిమిత్తం లేకుండా వ్యవహరిస్తాయి. అందుచేత తమ వద్ద నుండే ఆర్థిక వనరులలో ఒక భాగాన్ని ఉత్పత్తి కోసం వినియోగించకుండా స్పెక్యులేషన్ కోసం దాచిపెడతాయి. ఇలా ఆర్థిక వనరులను దాచిపెట్టడం మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలకు దుర్భరంగా పరిణమిస్తుంది. ఆర్థిక వనరులను పెట్టుబడిగా పెట్టే విషయంలో కూడా (అంటే రుణాలు ఇచ్చే విషయంలో) వేరు వేరు రుణ గ్రహీతలను వేరువేరుగా చూడడం ప్రైవేటు ఆర్థిక సంస్థల స్వభావం. వలసపాలన కాలంలో కూడా బ్యాంకులు ఎక్కువగా విదేశీ పెత్తనంలో ఉన్నప్పుడు భారతీయ వ్యాపారులు రుణాలు కోరినప్పుడు వారిపట్ల వివక్షపూరితంగా వ్యవహరించాయి. అప్పుడు భారతీయ కార్పొరేట్ సంస్థలు తమ స్వంత ఆర్థిక సంస్థలను ఏర్పాటు చేసుకుని వాటిద్వారా తమకు కావలసిన పెట్టుబడులను సమకూర్చుకోవడం కోసం ప్రయత్నించాయి. అదే సమయంలో ఆ సంస్థలు సైతం తమ వద్దకు రుణాలకోసం వచ్చిన చిన్న పెట్టుబడిదారులను, రైతులను, వృత్తిదారులను తిరస్కరించాయి. ద్రవ్య వ్యవస్థ అనేది పెట్టుబడిని నియంత్రించే వ్యవస్థ. ఎవరెవరికి ఈ ద్రవ్యం అందుతుంది, ఏ యే ప్రాంతాలకు అందుతుంది, ఎటువంటి కార్యకలాపాల కోసం అది వెచ్చించబడుతుంది వంటి అంశాలను అది నియంత్రిస్తుంది. తద్వారా ఒక దేశ ఆర్థిక వృద్ధి ఎంత వేగంతో, ఏ పద్ధతిలో ముందుకు సాగుతుంది అన్నది నియంత్రించబడుతుంది. ప్రైవేటు సంస్థల చేతుల్లో ఈ ద్రవ్య వ్యవస్థ ఉన్నంతకాలం అది అనుసరించిన వివక్షపూరిత వైఖరి వలన దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి దారీతెన్నూ లేకుండా పోయింది. పైగా ఆర్థిక వృద్ధికి అవరోధంగా కూడా మారింది.

## బీరేన్‌సింగ్ 'పూర్తి ఆడియోక్లిప్'ను ఫోరెన్సిక్‌కు పంపండి: సుప్రీంకోర్టు





**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మణిపూర్ హింసాకాండలో మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పాత్ర ఉందని పేర్కొంటున్న పూర్తి ఆడియోక్లిప్‌ను ఫోరెన్సిక్ విభాగానికి పంపాల్సిందిగా సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని ఆదేశించింది. పూర్తి ఆడియోక్లిప్‌ను గుజరాత్‌లోని జాతీయ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్శిటీ (ఎన్ఎఫ్ఎస్‌యు)కి పంపాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. పూర్తి ఆడియో క్లిప్‌ను ఎందుకు పంపలేదని జస్టిస్ సంజరుకుమార్‌లతో కూడిన ధర్మాసనం కేంద్రాన్ని ప్రశ్నించింది. 2023 మణిపూర్ హింసాకాండలో మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పాత్ర ఉందని సూచిస్తుందన్న ఆడియో రికార్డింగ్‌ను కుకీ హక్కుల సంఘం సమర్పించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబర్‌లో సుప్రీంకోర్టులో చివరి విచారణ తర్వాతే కేంద్రానికి 48 నిమిషాల పూర్తి రికార్డింగ్ అందిందని సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. ఆడియో క్లిప్ కోసం విచారణ చేసినప్పటికీ ముందుగా అది రాలేదని అన్నారు. ఈ కేసు గతంలో 10సార్లు జాబితా చేయబడిందని, 48నిమిషాల మొత్తం రికార్డింగ్ టేప్‌ను పిటిషన్‌తో పాటు సుప్రీంకోర్టుకి సమర్పించినట్లు కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ (కోహూర్) తరపున న్యాయవాదులు ప్రశాంత్‌భూషణ్, చెరిల్ డిసౌజాలు ధర్మాసనానికి తెలిపారు. దీంతో మొత్తం రికార్డింగ్‌ను ప్రభుత్వానికి పంపాలని పిటిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. త్వరిత చర్య కోసం, సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించడానికి దానిని ఎన్ఎఫ్ఎస్‌యుకి పంపాలని మోడీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## ఏపీలో టాటా పవర్ భారీ పెట్టుబడి.. రూ. 6,675 కోట్లతో నెల్లూరులో సోలార్ యూనిట్



**అమరావతి, పతాకం న్యూస్:** టాటా గ్రూప్‌కు చెందిన టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ , రాష్ట్రంలో భారీ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. నెల్లూరులో రూ. 6,675 కోట్ల పెట్టుబడితో 10 గిగావాట్ల సామర్థ్యం గల ఇంగాట్, వేఫర్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. దేశంలోనే ఇది అతిపెద్ద ఇంగాట్, వేఫర్ తయారీ కేంద్రం కానుండటం విశేషం. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. ఇఫ్కో కిసాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్‌లో ఈ ఫ్యాక్టరీని నిర్మించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎకరాల భూమిని కేటాయించింది. తొలిదశలో 120 ఎకరాలు, భవిష్యత్ విస్తరణ కోసం మరో 80 ఎకరాలు ఉపయోగించనున్నారు. సోలార్ సెల్స్, మాడ్యూల్స్, సెమీకండక్టర్ల తయారీలో ఇంగాట్లు, వేఫర్లు అత్యంత కీలకమైనవి. ఈ ప్రాజెక్టు ద్వారా దేశీయంగా వీటి ఉత్పత్తి పెరిగి, దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుంది. ఈ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా సుమారు 1,000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఫ్యాక్టరీకి అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు 200 మెగావాట్ల గ్రీన్ పవర్ ప్లాంట్‌ను కూడా టీపీఆర్ఈఎల్ ఏర్పాటు చేయనుంది. ఈ భారీ పెట్టుబడిపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌లో టాటా గ్రూప్ మరో చారిత్రక పెట్టుబడి పెట్టడం గర్వంగా ఉంది. మా ప్రభుత్వ పాలనా స్థిరత్వం, మౌలిక వసతులు, స్వచ్ఛ ఇంధన తయారీకి ఇస్తున్న ప్రాధాన్యతపై ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనం. ఈ ప్రాజెక్టు ద్వారా నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయి" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో సిద్ధంగా ఉన్న పారిశ్రామిక భూములు, బలమైన మౌలిక వసతులు, పోర్టు కనెక్టివిటీ వంటి అంశాలు ఈ పెట్టుబడిని ఆకర్షించడంలో కీలకపాత్ర పోషించాయి. ఈ ప్రాజెక్టుతో నెల్లూరు ప్రాంతం సోలార్ తయారీ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుంది.

## ప్రొసీడింగ్ ఆర్డర్స్ అనుమతి పత్రాలు అందజేత




**పరవాడ, పతాకం న్యూస్:** గ్రేటర్ విశాఖ, 79వ వార్డు, లంకెలపాలెం స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కార్యాలయంలో లబ్ధిదారులకు రెండు లక్షల యాభై వేల రూపాయల ప్రొసీడింగ్ ఆర్డర్స్ ను బుధవారం నాడు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థలం ఉండి, ఇల్లు కట్టుకునే వారికి రెండు లక్షల యాభై వేల రూపాయలు ప్రొసీడింగ్ ఆర్డర్స్ ను పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు, అనుమతి పత్రాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సర్వసిద్ధి సన్యాసిరాజు, స్థానిక ఉమ్మడి పార్టీనాయకులు సుందరపు శ్రీనివాసరావు, దాసరి రామారావు, దాము రోతి అర్జున్, శేఖర్, అప్పలరాజు, గణేష్, హౌసింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుపై పవన్ సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** గ్లోబల్ వార్మింగ్ (భూతాపం) ప్రస్తుతం ప్రపంచాన్నంతటిని భయభ్రాంతులకు గురి చేస్తోంది. దీనివల్ల సముద్ర మట్టాలు పెరిగి తీరప్రాంతంలో ఉన్న గ్రామాలు ప్రమాదంలో పడుతున్నాయి. తుపానుల వేళ అలలు విరుచుకుపడి ఇళ్లు, భూములు, ఆస్తులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఈ ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కోసం ప్రభుత్వం తీర ప్రాంతాల వెంబడి "గ్రేట్ గ్రీన్ వాలు కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రంలో తీర ప్రాంత అడవుల సంరక్షణ, ఆక్రమణల నిరోధానికి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గ్రేట్ గ్రీన్‌వాల్, 50 శాతం వరకు గ్రీన్‌కవర్' ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ నెలాఖరులోగా మార్గసూచీ సిద్ధం చేయాలని ఆయన పేర్కొన్నారు. తీరం వెంబడి ఉన్న మొక్కలకు భద్రత కల్పించడంతోపాటు అటవీ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూసే బాధ్యతను తీర ప్రాంత నివాసిత ప్రజలకు అప్పగించాలని నిర్దేశించారు. సచివాలయంలో అటవీశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతాన్ని మొత్తం పచ్చదనంతో నింపాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు వ్యక్తిగతంగా నిర్దేశించిన లక్ష్యాల్లో ఒకటని పవన్?కల్యాణ్? పేర్కొన్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలతో దీన్ని సాధించే విధంగా కార్యదళాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తీరప్రాంతాలను పర్యావరణపరంగా మరింత బలంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. అంతేకాకుండా, రాబోయే తరాలకు సహజ వనరులను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడటం కూడా ఈ ప్రాజెక్ట్? ఉద్దేశం అని తెలిపారు. ఈ గ్రీన్ బెల్ట్ ఏర్పాటుతో తీరప్రాంతాలు మరింత సురక్షితంగా మారతాయని పేర్కొన్నారు. తుపానుతో పాటు తీర ప్రాంతాల్లో కోతలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి కూడా ప్రజలను, భూభాగాన్ని రక్షించడంలో ఈ ప్రాజెక్ట్ కీలకంగా ఉంటుందన్నారు. తీరప్రాంత గ్రామాలు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్ ఒక దీర్ఘకాలిక పరిష్కారమన్నారు. ఈ ప్రాజెక్ట్ అమలులో నిపుణుల సలహాలను, శాస్త్రీయ విధానాలను పాటించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ కేవలం పర్యావరణాన్ని సంరక్షించడమే కాకుండా, జీవవైవిధ్యాన్ని వృద్ధి చేయడంలోనూ, స్థానిక ప్రజలకు కొత్త ఉపాధి మార్గాలను చూపించడంలోనూ సహాయపడుతుందని తెలిపారు.

## ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీలను తక్షణమే విడుదల చేయాలని మంత్రికి లేఖ



**విజయవాడ, పతాకం న్యూస్:** రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1200 కోట్ల పారిశ్రామిక రాయితీలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖను అందించారు. ఈ లేఖలో "రాష్ట్రంలో 2021 నుండి ఎంఎస్ఎంఇ ప్రోత్సాహకాల క్రింద 7675 ఎస్సీలు, 1320 ఎస్టీల యూనిట్లు రాయితీ పొందారు. ఆంధ్రప్రదేశ్ లో మొదటి తరం ఎస్‌సి, ఎస్‌టీ యువతి యువకులు పరిశ్రమలు పెడుతున్నారని, వాటిని నడపడంలో వారికి అనుభవం లేకపోవడంతో వచ్చే నష్టాలను భర్తీ చేయడం కోసం ప్రభుత్వం వారిని ప్రోత్సాహం ఇస్తూ రాయితీలు ప్రకటించింది. గత నాలుగు సంవత్సరాల నుండి విడుదల చెయ్యకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలు సైతం వీధుల్లో పడే పరిస్థితి ఏర్పడిరది. బ్యాంకుల ఒత్తిడికి తట్టుకోలేక వడ్డీలు చెల్లించలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారు. అప్పులు తీర్చడానికి ఆస్తులు కోల్పోతున్నారు. పారిశ్రామిక వేత్తలు కావాలన్న వారి కలలు పీడకలగా మారుతున్నాయి. చివరికి ఆ పరిశ్రమలు అన్ని ఎన్‌పిఎ (నాన్ ఫర్ఫర్మెన్స్ అసెట్స్) దివాళా తీసే దశకు చేసుకున్నాయి.వీరిపై ఎన్నో కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారు. ఆ కుటుంబాలు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి లైన ఎంఎస్ఎంఇ పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1200 కోట్ల పారిశ్రామిక రాయితీలను తక్షణమే విడుదల చేయాలని కోరుతున్నాను.గత 3 సం.ల నుండి వీరు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. గత మాసంలో ఎపిఐఐసి వద్ద కుటుంబాలతో సహా వచ్చి ఆందోళనకు దిగన సందర్భంగా సమస్యను వెంటనే పరిష్కరిస్తామని మీరు హామీ ఇచ్చారు.

(మొదటిపేజీ తరువాయి)

## ప్రారంభించిన నారాయణ

ఏడు గ్రామాల రైతుల నుంచి ప్రభుత్వం సుమారు 16,666 ఎకరాలను సమీకరించనుంది. ఇందుకోసం ఈ రోజు (బుధవారం) రైతుల నుంచి అంగీకార పత్రాలను అధికారులు స్వీకరిస్తున్నారు. ఈ ఏడు గ్రామాల రైతుల నుంచి స్వీకరించే భూమిని అంతర్జాతీయ క్రీడా పోటీల కోసం వినియోగిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇక్కడే ఒలంపిక్స్ నిర్వహణ కూడా జరుగుతుందని అన్నారు. రైతులు భూములపై తీసుకున్న రుణాలను గతంలో రూ.1.5 లక్షల వరకు మాఫీ చేశారని, ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నం జరగాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఆకాంక్షించారు. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్ళడం, నిధులు విడుదల చేయవద్దని వరల్డ్ బ్యాంక్‌కు లేఖలు రాయడం వైసీపీకి అలవాటుగా మారిందన్నారు గ్రామాల్లోని అంతర్గత నిర్మాణాలు, రోడ్‌లు, డ్రైన్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శ్రావణ్ కుమార్ సూచించారు. హరిశ్చంద్రపురం ఈనాం భూములు విషయంలోనూ నిర్ణయం తీసుకోవాలని, తాడికొండ నియోజకవర్గంలో ల్యాండ్ పూలింగ్ చేసిన 3 గ్రామాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

# అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా వార్షిక తనిఖీలు

**గొలుగొండ, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం పనితీరును మరింత మెరుగుపరచేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రేవతమ్మ,కృష్ణదేవిపేట ఎస్సై వి. ఋషికేశ్వరరావు, గొలుగొండ ఎస్సై పి.రామారావు ఎస్పీకి సాదరంగా స్వాగతం పలికారు.తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ పెండింగ్ కేసులు,రికార్డులు,స్టేషన్ నిర్వహణను క్షుణ్ణంగా పర్యవేక్షించారు.గంజాయి అక్రమ రవాణా,నాటుసారా తయారీ-విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని,ఈ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేయాలని అధికారులను ఆదేశించారు.సైబర్ నేరాల నివారణ,రోడ్డు భద్రత,మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ తో పాటు ఇతర మహిళా చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నేర నియంత్రణలో గ్రామాలు,కీలక జంక్షన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత



ఇవ్వాలని,కమ్యూనిటీ పోలీసింగ్‌లో ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు.అనంతరం భీమవరం చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ గంజాయి తరలింపును అడ్డుకోవడానికి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని జాగ్రత్తగా తనిఖీ చేయాలని,విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల రక్షణనే ధ్యేయంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

పాత నేరస్థులపై నిరంతర నిఘా,రాత్రి గస్తీ-తనిఖీలను ముమ్మరం చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి,తక్షణ సహాయం అందించాలని సూచించారు. స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని సానుకూలంగా స్పందించిన ఎస్పీ వారితో మమేకమైన వాతావరణం సృష్టించారు.

# కృష్ణాపురం పర్యాటక ప్రాజెక్టు పేరు ఇక 'పైనరీ'



**చింతపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని కృష్ణాపురంలో అటవీశాఖ అతిథుల కోసం ఏర్పాటు చేసిన పర్యాటక ప్రాజెక్టు వనవిహారి పేరును 'పైనరీ'గా అధికారులు మార్పు చేశారు. కృష్ణాపురంలో అటవీశాఖ కూటమి ప్రభుత్వ సహకారంతో పర్యాటకులకు ప్రత్యేక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. ఇక్కడ సందర్శకుల కోసం పది డబుల్, 15 సింగిల్ టెంట్లు, వాష్‌రూమ్, మరుగుదొడ్లు, గార్డెన్, నాలుగు కిలోమీటర్ల ట్రెక్కింగ్ పాత్‌తో పాటు కేఫ్‌టేరియా అందుబాటులో ఉన్నాయి. తాజాగా సెమీ కాటేజీల నిర్మాణం జరుగుతోంది. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ఇక్కడ బస చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ పర్యాటక ప్రాజెక్టును ఇప్పటి వరకు అటవీశాఖ ఈటీఐ, వనవిహారి అని పిలిచేవారు. అయితే ఈ ప్రాజెక్టు పైన్ తోటల మధ్య ఉండడంతో 'పైనరీ'గా నామకరణం చేశామని సబ్ డీఎఫ్‌వో వైవీ నరసింహరావు, రేంజ్ అధికారి బి.అప్పారావు తెలిపారు. ప్రధాన ద్వారంలో కృష్ణాపురం పైనరీ అని భారీ బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే ఆన్‌లైన్, గూగుల్‌లోనూ పైనరీ అని సెర్చ్ చేసేందుకు అనువుగా అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

# విశాఖలో ఓజోన్ వేలీలో బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కొత్త కార్యాలయం ఏర్పాటు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ (బీఓఐ) కొత్త కార్యాలయం ఏర్పాటు చేయనుంది. దీని కోసం వీఎంఆర్‌డీఏ నుంచి ఓజోన్ వేలీ లేఅవుట్‌లో 9,132.26 చ.గజాల స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ భూమి ఖరీదు రూ.27.39 కోట్లు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలో బీఓఐ పనిచేస్తుంది. పోర్టులు, ఎయిర్‌పోర్టుల్లో ఇమ్మిగ్రేషన్ వ్యవహారాలన్నీ బీఓఐ పరిధిలోకే వస్తాయి. విదేశాల నుంచి వచ్చే వారి వ్యవహారాలన్నీ వీరే చూస్తారు. అనుమతులు లేకుండా వచ్చేవారిని, గడువు తీరిన తరువాత ఇంకా ఇక్కడే కొనసాగే వారిని గుర్తించి, వెనక్కి పంపిస్తారు. సిబ్బంది కొరత, ఇతర కారణాల రీత్యా విమానాశ్రయాలు, పోర్టుల్లో ఇమ్మిగ్రేషన్ వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వ పోలీసులతో నడిపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇవి సవ్యంగా నడవడం లేదని పలు సందర్భాల్లో నిరూపితమైంది. విదేశీయులు సరైన అనుమతులు లేకుండానే నగరాల్లో నివాసం ఉంటూ వివిధ వ్యవహారాల్లో పాల్గొంటున్నట్టు కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బీఓఐని బలోపేతం చేయాలని నిర్ణయించింది. క్రమంగా పోర్టులు, విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ పనులు రాష్ట్ర పోలీసులతో కాకుండా బీఓఐ సిబ్బందితోనే చేయించాలని సూచించింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది. ఆ క్రమంలో విశాఖపట్నం పోర్టులో ఇమ్మిగ్రేషన్ వ్యవహారాలన్నీ ఇటీవలె ఒక్కొక్కటికి బీఓఐకి అప్పగిస్తున్నారు. త్వరలో విశాఖపట్నం విమానాశ్రయం వ్యవహారాలు కూడా చేతులు మారనున్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ఓజోన్ వేలీలో 'ఆప్టికల్ కేరక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్) కాంప్లెక్స్' ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ విదేశీయుల డాక్యుమెంట్లన్నీ సాంకేతికంగా విశ్లేషిస్తారు. డేటా భద్రపరుస్తారు. అవసరమైనప్పుడు ఉపయోగించుకుంటారు. భూమికి సంబంధించి ఇంకా కొద్ది మొత్తం బీఓఐ చెల్లించాల్సి ఉందని, అది పూర్తయిన వెంటనే భూమిని అప్పగిస్తామని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.

## సముద్ర తీరంలో, కారిడార్ భూముల్లో

# యథేచ్ఛగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు?



**నక్కపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని సముద్ర తీర గ్రామాల్లో ఇసుక, ఇండస్ట్రియల్ కారిడార్ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రిపూట యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ, డంపర్ లారీలు, ట్రాక్టర్లద్వారా రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఖాళీ స్థలాలను ఎత్తు చేయడానికి, భవన నిర్మాణాల్లో పునాదులు నింపడానికి రవాణా చేస్తున్నారు. నక్కపల్లి మండలంలో డీఎల్‌పురం, బంగారమ్మపేట, పెదతీనార్ల, అమలాపురం, తదితర గ్రామాలు సముద్ర తీరంలో వున్నాయి. వాస్తవంగా సముద్రం ఇసుక భవన నిర్మాణాలు, ఇతర కట్టడానికి పనికిరాదు. అయితే రియల్ ఎస్టేట్ వెంచర్లలో లోతట్టు ప్రదేశాలను ఎత్తు చేయడానికి, భవన నిర్మాణాల్లో పునాదులు నింపడానికి సముద్రం ఇసుకను వినియోగిస్తున్నారు. దీంతో సముద్రం ఇసుకకు గిరాకీ ఏర్పడడంతో పలువురు దీనిని తమకు అనుకూలంగా మార్చుకొని వ్యాపారం చేయడం మొదలుపెట్టారు. రాత్రిపూట ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తవ్వి, టిప్పర్ లారీలు, ట్రాక్టర్లలోకి లోడింగ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి నక్కపల్లితోపాటు పాయకరావుపేట మండలంలోని పలు గ్రామాలకు రవాణా చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక దూరాన్నిబట్టి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. సముద్ర తీర ప్రాంతం అటవీ శాఖ పరిధిలో వుండడం, సిబ్బంది చుట్టం చూపుగా కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం, రెవెన్యూ అధికారులు తమ పరిధి కాదని పట్టించుకోకపోవడంతో సముద్ర తీర ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. దీనివల్ల భవిష్యత్తులో తీవ్ర తుఫాన్లు వచ్చినప్పుడు ఉప్పెన సంభవిస్తే సముద్రం నీరు గ్రామాలను ముంచెత్తుతుందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని డీఎల్‌పురం, వేంపాడు, రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, అమలాపురం తదితర గ్రామాల పరిధిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం గతంలో ప్రభుత్వం భూములను సేకరించింది. వీటిల్లో కొండపోరంబోకు భూములు వున్నాయి. ఇక్కడ నాణ్యమైన గ్రావెల్ వుండడంతో అక్రమార్కులు పగలు, రాత్రి అన్న తేడా లేకుండా గ్రావెల్ తవ్వుకుపోతున్నారు. ఈ భూములన్నీ ఏపీఐఐసీ ఆధీనంలో వుండడం, ఇక్కడ సిబ్బంది అంతంతమాత్రంగానే ఉండడంతో కారిడార్ భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకోలేకపోతున్నారు. ఆర్అండ్‌బీలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి రాత్రి వేళల్లో పలువాహనాల్లో గ్రావెల్‌ను తరలిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఉక్కు భూముల కాజేతకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు సాగనివ్వం : సిపిఐ (ఎం) విశాఖ జిల్లా కమిటీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ (విఇఆర్) పేర శ్రీకాకుళం నుండి కాకినాడ జిల్లాల వరకు మొత్తం 9 జిల్లాల పరిధిలో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల పెట్టుబడుల కోసం 232 పేజీలతో కూడిన ఒక ప్రణాళికను ఇటీవల తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని, ఇందులో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన సుమారు 2500 ఎకరాల భూమిని ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రతిపాదనలు చేయడం దుర్మార్గమని తక్షణమే ఈ ప్రతిపాదనను విరమించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు_ లోకనాధం, సిపిఎం విశాఖ జిల్లా నాయకులు 78వ వార్డు కార్పొరేటర్ డా బి గంగారావు, స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు ఎన్ రామారావు, నమ్మి రమణ డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం విశాఖలోని జగదాంబ సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోకనాధం మాట్లాడుతూ.. కుట్రపూరిత వ్యూహంతో చంద్రబాబు ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకొచ్చినట్టు తెలుస్తున్నదని విమర్శించారు.. ఇంకా ఆయన ఏమన్నారంటే అందుకే రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు రూ.2400 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలను అడ్డం పెట్టుకొని ఈక్విటీగా మార్చుకొని అందుకు పరిహారంగా ప్లాంట్ భూములను తమ వశం చేసుకునేందుకు కన్నేసి నట్లు తెలుస్తున్నది. తక్షణం ఈ దుర్మార్గ ప్రతి పాదనను ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం బహిరంగంగా ప్రకటన చేయాలని, అలాగే స్టీల్‌ప్లాంట్ భూములు ప్లాంట్ విస్తరణకు మాత్రమే ఉపయోగించాలని సీపీఐ(ఎం) విశాఖ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఇప్పటికే విశాఖ స్టీల్‌ప్లాంట్ కు చెందిన 1100 ఎకరాల భూమిని ఎన్.ఎం.డీ.సి ముడి సరుకుల నిల్వల యార్డు కొరకు 33 ఏళ్ళు పాటు లీజుకు తీసుకుంది. ఇప్పటి వరకు ఈ భూమిలో యార్డ్ నిర్మాణం చేయకుండా ఖాళీగా ఉంచింది. దీనిని ఇపుడు కేంద్ర బీజేపీ ప్రభుత్వం అదానీకి ధారాదత్తం చేయటానికి ప్రయత్నాలు ప్రారంభించినట్లు వార్తలస్తున్నాయి. ఇదే జరిగితే స్టీల్ ప్లాంట్ యొక్క భూములు సుమారు 3500 ఎకరాలకు పైగా అదానీ, మిట్టల్ వంటి కార్పొరేట్ సంస్థల పరమయ్యే ప్రమాదం ముంచుకొస్తుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నది. పైకి ప్లాంట్ ను కాపాడుతాం అంటూనే దీనిని చావు దెబ్బ తీస్తున్నారు. గత ఏడాది కాలంలో నైపుణ్యత కలిగిన సుమారు 6 వేల మంది నిర్వాసిత మరియు కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారు. విఆర్ఎస్ పేర 1700 మందికి పైగా పర్మినెంట్ కార్మికులను తొలగించారు. ఇపుడు మూడో సారి వి.ఆర్.ఎస్ నోటిఫికేషన్ ఇచ్చారు. నేడు తనకు అనుకూలంగా ఉన్న ఇతర రాష్ట్రాల నుండి వలస కార్మికులను తెచ్చి పెట్టుకుంటున్నారు. నిర్వాసితులకు ఉపాధి కల్పించకుండా తీవ్ర ద్రోహం చేస్తున్నారు. ప్లాంట్ లో కోక్, సింటర్ ప్లాంట్ అవసరానికి తగ్గట్టు తయారు చేయకుండా బయటనుండి అదనంగా టన్ను కోక్‌కు రూ.8 వేలు, సింటర్‌ప్లాంట్ పెల్లెట్స్‌కు రూ. 2వేలకు పైగా ఖర్చుచేసి రప్పించారు. వందలకోట్ల కమీషన్లకు పాల్పడ్డారు. ఫలితంగా ఉత్పత్తిలో రా మెటీరియల్ ఖర్చు 60 నుండి 78 శాతానికి పెంచేశారు. దీంతో ఉత్పత్తి భారీగా పెరిగినా ప్లాంట్ నష్టాలు బారిన పడుతున్నది. గడిచిన 9నెలల్లో రూ.780 కోట్లు పైబడి నష్టాలు వచ్చాయి. యంత్రాలు మరమ్మత్తులు చేయకపోవడంతో అనేక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తుంది. ఈ వైఫల్యానికి కార్మికులమీద ప్రభుత్వం, యాజమాన్యం నెట్టబడుతోంది. బిజెపి, తెలుగుదేశం, జనసేన కూటమి నిర్వాహకంవల్ల ఈ నష్టాలు చవిచూసాయి. నరేంద్ర మోడీ ఉ చంద్ర బాబు ఉ పవన్ కళ్యాణ్ కూటమి చర్యలు విశాఖ స్టీల్ ప్లాంట్ ను మరింత నష్టాలు పాలుజేసేలా ఉన్నాయి. కుట్ర పూరిత వ్యూహంతో ఈ చర్యలకు పాల్పడుతున్నారు. ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపటానికి చంద్రబాబు నాయుడు తరచూ విశాఖ స్టీల్ ప్లాంట్ పైనా, అందులో పనిచేసే కార్మికులపై విష ప్రచారం చేస్తున్నారు. అంతిమంగా ప్లాంట్ ను మిట్టల్, అదానీ వంటి కార్పొరేట్ లకు ధారాదత్తం చేసేందుకు వేగంగా పావులు కలుపుతున్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు_.లోకనాధం, 78వవార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు ఎన్.రామారావు, నమ్మి రమణలు పాల్గొన్నారు.

# అమరావతి వొకేషనల్ కళాశాలలో ఆధార్ క్యాంప్



**చింతపల్లి, పతాకం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం జనవరి 5 నుండి 9 వరకు వివిధ విద్యాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వామిగెడ్డ సచివా లయం డిజిటల్ అసిస్టెంట్ బత్తుల విజయకుమారి తెలిపారు. ఇందులో భాగంగా చింతపల్లి లోని అమరా వతి వొకేషనల్ కళాశాలలో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంపులో చాలా మంది విద్యార్థుల ఆధార్ కార్డులో సవరణలు చేసినట్లు, కళాశాల వద్దనే క్యాంపు ఏర్పాటు చెయ్యడం అధిక సంఖ్యలో విద్యార్థులు తమ ఆధార్ లో సవరణలు చేయించుకున్నారన్నారు. తమ కళాశాలలో ఆధార్ క్యాంపు నిర్వహించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ సాగిన నాగార్జున, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# రాష్ట్రపతిని కలిసిన ఈఎన్‌సీ చీఫ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** తూర్పు నౌకాదళం ప్రధానాధికారి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా తన సతీమణి ప్రియా భల్లాతో కలిసి ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. భారత రక్షణ దళాలకు సుప్రీం కమాండర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్రపతికి తీర ప్రాంత రక్షణలో ప్రస్తుత పరిస్థితులు, తూర్పు నౌకాదళం సన్నద్ధతతో పాటు వచ్చే నెల ఫిబ్రవరిలో విశాఖపట్నంలో నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026, మిలాన్-2026, ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం తదితర అంశాలను వివరించారు. భార్యతో కలిసి జ్ఞాపికను బహూకరించారు.

# కొత్త టెక్నాలజీల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు: ఎమ్మెల్యే పంచకర్ల



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన వైజాగ్ ఫార్మా ఎక్స్పో ను బుధవారం నాడు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు. తదనంతరం ఫార్మా ల్యాబ్ ఎక్స్పోలో పరవాడ ఫార్మసిటీ, అచ్యుతాపురం, పైడి భీమవరం, నక్కపల్లి ప్రాంతాలలో ఉన్న ఫార్మ కంపెనీ ప్రతినిధులు ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించి, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల నిర్వహణలో కొత్త టెక్నాలజీ ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని, పరిశ్రమల నిర్వహణలో కొత్త టెక్నాలజీల ద్వారా నిర్వహణ పెంచడం మరియు ప్రమాదాల నివారణ చేయడం శుభ పరిణామని రమేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మా ప్రతినిధులు, పరవాడ మండల ఉమ్మడి ఎన్డిఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎంఎస్ఎంఈ పార్కుల్లో
# ఊపందుకోని పనులు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లా ఏర్పాటై మూడున్నరేళ్లు గడుస్తున్నా.. ఇంకా పారిశ్రామికంగా పార్వతీపురం మన్యం అభివృద్ధి చెందడం లేదు. పరిశ్రమల ఏర్పాటు కలగా మారింది. హడావుడిగా జిల్లాను ఏర్పాటు చేసిన గత వైసీపీ సర్కారు .. పారిశ్రామికీకరణపై దృష్టి సారించలేదు. ఇక కూటమి ప్రభుత్వం.. రాష్ట్రంలో ప్రతి జిల్లానూ పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు) పార్కుల ఏర్పా టుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజలు ఎంతో ఆనందించారు. జిల్లాలో ఎంతోకొంత పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ఆశపడ్డారు. అయితే మన్యంలో మాత్రం ఆ పనులు ఊపందుకోవడం లేదు. పట్టుమని పదిమందికి ఉపాధినిచ్చే పరిశ్రమ ఒక్కటి కూడా జిల్లాలో లేకపోవడంతో స్థానిక నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉపాధి కోసం నానా అవస్థలు పడాల్సి వస్తోంది. దీనిపై జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో రామభద్రపురం మండలం కొట్టక్కి, పార్వతీపురం మండలం సందలింగి, గరుగుబిల్లి మండలం సిలకాం పంచాయతీలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. అయితే ఆ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కోసం అడుగులు పడ్డాయి. ఈ మేరకు ఏడాది కిందట ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్క్‌ల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేశారు. కానీ ఒక్క పాలకొండ నియోజకవర్గంలో మినహాయిస్తే.. మిగతా మూడు నియోజకవర్గాల్లో ఆ ప్రక్రియ సాగలేదు. పార్వతీపురం, కురుపాం, సాలూరులో ఎంఎస్ ఎంఈ పార్క్‌లకు సంబంధించి స్థలాలు ఇంకా ఖరారు కాలేదు. కాగా గత ఏడాది మే నెలలో సీతంపేట మండలం పనుకువలస గ్రామం వద్ద ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. అయితే నేటికీ అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు. సుమారు రూ. ఏడు కోట్లతో చేపట్టాల్సిన అంతర్గత రహదారులు నిర్మాణాలు కూడా పూర్తికాలేదు. ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో .. పారిశ్రామికంగా ప్లాట్లు విభజించి ఇంప్పుడు ఆన్‌లైన్‌లో పెడతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. స్థానికంగా పరిశ్రమలు లేకపోవడంతో జిల్లాకు చెందిన యువత ఉపాధి కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారు. స్వగ్రామాలను వదిలి దూర ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఐటీఐతో పాటు వివిధ సాంకేతిక విద్యలు పూర్తి చేసిన వారికి కూడా జిల్లాలో ఉపాధి అవకా శాలు లేకుండాపోయాయి. నాన్ టెక్నికల్ విద్యనభ్యసించిన వారి పరిస్థితి కూడా దయనీయంగా మారింది. స్థానికంగా ఉపాధి లభించక.. దూర ప్రాంతాలకు వెళ్లలేక నానా అవస్థలు పడు తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని మన్యం వాసులు కోరుతున్నారు.

## అడ్డతీగల జిటిడబ్ల్యూ ఎబి హెచ్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు




**అడ్డతీగల, పతాకం న్యూస్:** అడ్డతీగల జి టి డబ్ల్యూ ఎ బి హెచ్ స్కూల్ లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. అడ్డతీగల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పరిధిలో పని చేస్తున్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథరిటీ పారా లీగల్ వాలంటీర్ తీగల బాబురావు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు.నేషనల్ లీగల్ సర్వీసెస్ అథరిటీ ఆదేశాలపై పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన . ఇందులో భాగంగా విద్యార్థులకు విద్యా హక్కు చట్టం కోసం కూడా అవగాహన కల్పించారు.

## చోద్యంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీఓ



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం చోద్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్ నిర్వహణ తీరును పరిశీలించారు. 8వ తేదీన కొత్తమల్లంపేటలో, 9వ తేదీన గొలుగొండలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మండలానికి ఇంకా మూడు ఆధార్ కిట్లు సాంకేతిక సమస్యల కారణంగా అందలేదని,కిట్లు వచ్చిన వెంటనే మండలమంతా క్యాంపులు విస్తరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పారావు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు 800 చలి దుప్పట్లు ఉచిత పంపిణీ



**అరకులోయ, పతాకం న్యూస్:** శ్రీ చిన్నజీయర్ స్వామి సహకారంతో వికాస తరంగిణి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అరకువేలి ఏపీ ఆర్ పీవీటీజీ స్కూల్ మరియు ఏపీ ఆర్ బాయ్స్ కాలేజీలో గల గిరిజన విద్యార్థులకు ఉచిత చలి దుప్పట్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. వికాస తరంగిణి రాష్ట్ర అధ్యక్షులు ఎం. వర్మ, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర చేతుల మీదుగా సుమారు 800 మంది గిరిజన విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడిన వికాస తరంగిణి నాయకులు, పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో సంస్థ ఆధ్వర్యంలో 5 వేల చలి దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ ఉచిత వైద్య సేవలు అందిస్తోందని, ప్రకృతి వైపరీత్యాలు ఎక్కడ జరిగినా అక్కడ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. పాడేరు ఏజెన్సీలో గిరిజన సంఘం విజ్ఞప్తి మేరకు 3 వేలకు పైగా దుప్పట్లు పంపిణీ చేశామని, అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో శ్రీ చిన్నజీయర్ స్వామి సహాయ సహకారాలతో 10 వేల దుప్పట్లు ఉచితంగా అందజేశామని వివరించారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, తీవ్ర చలి గాలులు వీస్తున్న నేపథ్యంలో దుప్పట్లు అందించిన వికాస తరంగిణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులకు మరిన్ని సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వికాస తరంగిణి సంస్థ ఇలాంటి సేవా కార్యక్రమాలతో గిరిజన ప్రాంతాల్లో చలికాలంలో ఆదుకుంటూ మానవతా స్ఫూర్తిని చాటుతోంది.ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్ పీవీటీజీ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపల్ చి. హెచ్. రమణ, కళాశాల ప్రిన్సిపల్ జి. రామకృష్ణ, గిరిజన సంఘం నాయకులు_. రామారావు, బి. దశరథ్, ఎస్.ఎఫ్.ఐ మండల కార్యదర్శి ఎస్. ఐసు బాబు, సి.ఐ.టి.యు మండల కార్యదర్శి జి. భగత్ రాం, కళాశాల లెక్చరర్ చంద్రు పాడల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం విక్రయాలకు
# రైతుల తీవ్ర అవస్థలు



**పాలకొండ, పతాకం న్యూస్:** జిల్లాలో ఇలా ఎంతోమంది రైతులు ధాన్యం విక్రయాలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాస్తవంగా ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగానే జరిగింది. అయితే గతపది రోజులుగా సీన్ మారింది. లక్ష్యనికి చేరువవుతున్న సమయంలో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. అధికారులు, రైస్‌మిల్లర్ల మధ్య సమన్వయ లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. తమకు బ్యాంకు గ్యారెంటీలు ఉన్నా ఉన్నతాధికారులు నుంచి టార్గెట్లు రాలేదని, ట్రక్కు షీట్లు ఇవ్వకపోతే ధాన్యాన్ని సేకరించలేమని కొందరు రైస్‌మిల్లర్లు చెబుతున్నారు. దీనితో ఎంతో ఉత్సాహంగా మిల్లులకు పరిగెత్తిన రైతులు అంతే నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. జిల్లాలో 111 రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటి ద్వారా 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటివరకు 2 లక్షల మెట్రిక్ టన్నులకు పైబడి ధాన్యం సేకరించారు. 99 శాతం మంది రైతుల ఖాతాల్లోకి నిధులు జమయ్యాయి. ఇక మిగిలిన ధాన్యాన్ని సేకరించేందుకు చొరవ చూపాల్సి ఉంది. పాలకొండ వీరఘట్టం, జియమ్మవలస, తదితర మండలాల్లో ఇంకా రైతుల వద్దే ధాన్యం నిల్వలున్నాయి. వాటి కొనుగోలుకు సంబం?ధించి బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లు ఉన్న రైస్‌మిల్లులకు అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే బీజీలు ఉన్న కొంతమంది రైస్‌మిల్లర్లు అధికారుల ఆదేశాలు కోసం ఎదురుచూస్తున్నారు. మరికొన్ని రైస్ మిల్లులకు ధాన్యం సేకరణకు అనుమతులు ఉన్నా.. అనుకున్న స్థాయిలో బీజీలు లేవు. దీంతో ఆయా మిల్లర్లు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. వాస్తవంగా జిల్లాలో మిల్లర్లంతా ఒకేలా బ్యాంకు గ్యారెంటీ (బీజీ)లను ఇవ్వలేదు. దీంతో బీజీలు అధికంగా ఇచ్చిన వారు అసోసియేషన్, అధికారుల తీరుపై గుర్రుమంటున్నారు. తక్కువ బీజీలు ఇచ్చిన మిల్లర్లకు న్యాయం చేయడానికి 1:3 వంటి నిబంధనలు తీసుకొస్తున్నారని ఆక్షేపిస్తున్నారు. బ్యాంకు గ్యారెంటీలు అందుబాటులో ఉన్నా ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వడం లేదని చెబుతున్నారు. పూర్తిగా బీజీలు చెల్లించని వారికి టార్గెట్లు ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక సమస్యలను చూపి ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వడం లేదని మరికొందరు చెబుతున్నారు. ఏదేమైనా ఇలా పలు సాంకేతిక పరమైన అంశాలను చూపి. ధాన్యం సేకరణ చేయకపోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## హిందూజా బొగ్గు లారీల దూళి, కాలుష్యాలను అరికట్టాలి



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలంలో హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం, ఎన్టిపిసి ధూళి లారీలు కాలుష్యం అరికట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అధిక లోడ్లతో ప్రయాణిస్తున్న లారీ పై కఠినమైన చర్యలు తీసుకోవాలని కాలుష్యం అరికట్టాలని హిందూజా బొగ్గు లారీలు అధిక లోడులతో వెళ్లడం వలన బొగ్గు రోడ్లపై పడిన దుమ్ము ధూళి ఈ ప్రాంత ప్రజలపై ఎగిసిపడుతుందని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లంైలపాలెం, పరవాడ మండల పరిషత్ జంక్షన్ , పరవాడ సినిమా హాల్ జంక్షన్, ఊటగడ్డ ప్రాంత ప్రజలు ఈ దుమ్ము, ధూళి కాలుష్యంతో కాలుష్య కోరల్లో చిక్కుకొని అల్లాడిపోతున్నారని వెంటనే ప్రభుత్వం అధిక లోడుతో ప్రయాణిస్తున్న బొగ్గు లారీలు, ఎన్టిపిసి దూళి లారీలపై కఠిన చర్యలు తీసుకొని ప్రజల ఆరోగ్యాలు కాపాడాలని కోరారు. హిందూజా యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఈ ప్రాంత పర్యావరణాన్ని కాపాడాలని గనిశెట్టి కోరారు. భవిష్యత్తులో బొగ్గు లారీలు దూళి లారీలు కాలుష్యంపై దీక్షలుచేపడతామని గనిశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే నాయుడు, శ్రీను, అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు

## జల సంరక్షణ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



**విజయనగరం, పతాకం న్యూస్:** వీరఘట్టం మండలంలోని ఉపాధి హామీ నిధులతో చేపట్టిన జల సంరక్షణ పనులను మంగళవారం జలశక్తి, జల భగీరథ, జేఎస్‌జేబీ 2.0 కేంద్ర బృందం పరిశీలించింది. తలవరం, తెట్టంగి, కుమ్మరిగుంట, బిటివాడ, వండువ, చిదిమి, పివిఆర్‌పురం, చినగోర, మూల లంక, నడుకూరు, నడిమ్మిల్ల గ్రామాల్లో పనులను ప్రత్యక్షంగా వారు పరిశీలన చేవారు. బృందంలో సెంట్రల్ నోడల్ అధికారి వి.సుగుణాకరరావు, డీఈవో సంతోష్‌కుమార్, ఏపీడీ బి.శ్రీహరిరావు, పార్వతీపురం ఏపీడీ టి.త్రివిక్రమరావు పాల్గొన్నారు. మండలానికి చెందిన ఏపీవో జి.సత్యంనాయుడు, ఈసీ బి.కృష్ణప్రసాద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## చలి తీవ్రత నేపథ్యంలో పర్యాటకులు మరింత జాగ్రత్తలు పాటించాలి: రాజేశ్వరి



**చింతపల్లి, పతాకం న్యూస్:** ఉపాధ్యాయురాలు ఎస్ రాజేశ్వరి స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చింతపల్లిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది, ప్రజలు చలి నుండి తమను తాము కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. పొగ మంచు, మబ్బులు అడవి అందాలను కప్పివేస్తు న్నాయి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, చలి సంబంధిత సమస్యలను నివారించడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్నికాపాడుకోవడానికి వెచ్చని దుస్తులు ధరించాలి. చలిగా ఉన్నప్పుడు వెచ్చగా ఉన్న ప్రదేశంలో ఉండేలా ప్రయత్నం చేయాలి. వెచ్చని పానీయాలు తాగాలి. చలిలో బయట తిరగకుండా ఉండాలని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉన్న డాక్టర్‌ను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఆమె సూచించారు. చలి తీవ్రత అధికమవుతున్న కొలది వృద్ధులు చలిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు. బాధ్యత గల యువత, విద్యావంతులు వృద్ధుల పట్ల కాస్త జాలి చూపించి వృద్ధులను కాపాడే ప్రయత్నం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. దూర ప్రాంతాల నుంచి అడవి అందాలను చూడటానికి వచ్చే పర్యాటకులు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నెమ్మదిగా వెళ్లే దిశగా ప్రయత్నం చేయాలని ఆమె అన్నారు.

## 200 మంది రైతులకు రాజముద్ర పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ



**అరకులోయ, పతాకం న్యూస్:** అరకులోయ మండలం బొండం పంచాయతీ రేగ గ్రామంలో బుధవారం తహసీల్దార్_. కుమారస్వామి ఆధ్వర్యంలో 200 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారు.రేగ, రంపుడువలస, రంగినిగుడ గ్రామాలకు మొత్తం 219 పాస్‌బుక్‌లు అందించనున్నారు. గత ప్రభుత్వం ఇచ్చినవి వెనక్కి తీసుకుని నూతనవి అందిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుంకరి ఆనందరావు, సర్పంచ్ దుర్యోధన భాస్కరరావు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రెవెన్యూ వ్యవస్థ పారదర్శకంగా సాగుతోందని కొనియాడారు. రీసర్వే అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కొవ్వూరు వంతెనపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం



**కొవ్వూరు, పతాకం న్యూస్:** తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు ఫ్లైఓవర్‌పై బుధవారం వేకువజామున ఓ ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఖమ్మం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రావెల్స్ బస్సు కొవ్వూరు ఫ్లైఓవర్ పైకి వచ్చేసరికి సెల్ఫ్ మోటార్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్లు డీఎస్పీ దేవకుమార్, సీఐ విశ్వం తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించిన డ్రైవర్ బస్సును నిలిపివేసి అందులోని ప్రయాణికులను నలుగురు సిబ్బంది సురక్షతంగా బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.80 లక్షల మేర నష్టం జరిగిందని అంచనా వేసినట్లు కొవ్వూరు అగ్నిమాపక అధికారి ఏవీఎన్ఎస్ వేణు తెలిపారు. ప్రయాణికులను వేరే బస్సులో తరలించారు.

## ప్రభుత్వ వైద్యశాలల విభజన




**ఒంగోలు, పతాకం న్యూస్:** ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలను విభజించారు. గతనెల 31వతేదీన మార్కాపురం జిల్లా ఏర్పాటు కావడంతో రెండు జిల్లాల పరిధిలో ఉన్న ప్రభుత్వ వైద్యశా లలను ఆయా జిల్లాలకు కేటాయించారు. ప్రకాశంలో 61 వైద్యశాలలు ఉండగా మార్కాపురం జిల్లాలో 53 ఉన్నాయి. మార్కాపురం జిల్లాకు అక్కడి అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారికి డీఎంహెచ్‌వోగా బాధ్యతలు అప్పగించారు. ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల విభజనను పార్లమెంట్ స్థానం పరిధిలో విభజన చేయగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాకేంద్రం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేశారు. మార్కాపురం జిల్లాలో కనిగిరి, మార్కాపురం, వైపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలతో ఏర్పాటు చేశారు. ప్రకాశం జిల్లాలో ఒంగోలు, కొండపి, ఎస్ఎన్‌పాడు, దర్శి నియోజకవర్గాలతోపాటు నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు, బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి నియోజకవర్గాన్ని కలిపారు. ప్రస్తుతం కందుకూరు, అద్దంకి నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలు కూడా ఇప్పుడు ప్రకాశంలోకి వచ్చాయి.

## పోలీస్ సర్కిళ్ల విభజన జరిగేనా?



**అద్దంకి, పతాకం న్యూస్:** గత వైసీపీ పాలనలో హేతు బద్ధత లేకుండా పోలీస్ సర్కిళ్లను విభజించారు. ప్రస్తుతం ఆప్రభా వం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పడటంతో అద్దంకి, దర్శి నియోజకవర్గాలలోని అన్ని మండలాల పోలీస్‌స్టేషన్‌లు ఒకే సబ్‌డివిజన్ పరిధిలోకి వచ్చాయి. ఇప్పటికే దర్శిలో డీఎస్పీ ఆఫీస్ ఉండటంతో కొత్తగా అద్దంకిలో కార్యాలయం ఏర్పాటు జరిగే అవకాశం ఉండకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తగా ఏర్పడ్డ అద్దంకి డివిజన్‌లో మొత్తం 11 పోలీస్‌స్టేషన్‌లు ఉండగా అద్దంకి నియోజకవర్గంలోని ఆరు స్టేషన్‌లు మూడు సర్కిళ్లుగా ఉన్నాయి. అద్దంకి పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేసి సీఐని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. కొరిశపాడు, మేదరమెట్ల, పంగులూరు పోలీస్‌స్టేషన్‌లను అద్దంకి రూరల్ సర్కిల్‌గా చేసి సర్కిల్ కార్యాలయాన్ని అద్దంకి నుంచి మేదరమెట్లకు మార్పుచేశారు. సంతమాగులూరు, బల్లికురవ పోలీస్ స్టేషన్‌లను సంతమాగులూరు సర్కిల్‌గా ఏర్పాటుచేశారు. దర్శి నియోజకవర్గంలో దర్శి సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలు ఉన్నాయి. జిల్లాల విభజన నేపథ్యంలో ఇప్పటివరకు త్రిపురాంతకం సర్కిల్ పరిధిలో ఉన్న కురిచేడు, దొనకొండలను పరిధి మార్పు చేయాల్సి వచ్చింది. ఇప్పటికే దర్శి సర్కిల్‌లో దర్శి మునిసిపాలిటీతోపాటు ఆ మండల పరిధిలోని గ్రామాలు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలు ఉన్నాయి. అదనంగా కురిచేడు, దొనకొండలను చేర్చితే సర్కిల్ పరిధి మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు సర్కిళ్లకు ఆయా మండలాలను సర్దుబాటు చేస్తారా? లేక యథవిధిగా కొనసాగిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం అద్దంకి నియోజకవర్గంలోని సర్కిళ్లకు రెండు, మూడు మండలాలు మాత్రమే ఉండటంతో సీఐలకు పని కూడా అంతంతమాత్రంగానే ఉంది. మొత్తం 11 పోలీస్‌స్టేషన్‌లను నాలుగు సర్కిళ్ల పరిధిలోకి విభజిస్తే పని విభజనకు అవకాశం ఉంటుంది. అలా కాకుండా ప్రస్తుతం ఉన్న విధంగానే కొనసాగిస్తే దర్శి సర్కిల్‌లో పనిభారం మరింత పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# సంక్రాంతి బరిలో దిగేందుకు 'పందెం కోళ్లు' సిద్ధం..

# ప్రత్యేక శిక్షణతో రాటుదేలుతున్న కోడి పుంజులు





**భీమవరం, పతాకం న్యూస్:** మన రాష్ట్రంలో సంక్రాంతి అనగానే ముందుగా గుర్తొచ్చేవి కోడి పందేలు. కేవలం పొరుగు రాష్ట్రాల వారే కాకుండా, విదేశాలలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు కూడా పందేలను వీక్షంచేందుకు సంక్రాంతికి సొంతూళ్లకు వస్తుంటారు. అంత క్రేజ్? ఉన్న కోడి పందేలకు 'బరి'లో దిగే కోళ్లు మామూలుగా ఉంటే ఎలా? అందుకే వాటి ఎంపిక నుంచి శిక్షణ వరకు ప్రతిదీ ప్రత్యేకమే. అది తినే పుడ్? నుంచి బరిలో చేసే ఫైట్? వరకు అన్నీ ఆసక్తికరమే. ప్రధానంగా ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు కోడి పందేలకు పెట్టింది పేరు. తెలుగింటి పెద్ద పండగకు సంప్రదాయ క్రీడలుగా ప్రారంభమైన కోడి పందేలు ఆ 4 రోజులు అతి పెద్ద జూదంగా, కోట్లలో పందేలు కాసే స్థాయికి చేరుకున్నాయి. బ్రాండింగ్ ఉండి, గతంలో పందేల్లో గెలిచిన ఎక్కువ కోళ్లకు శిక్షణ ఇచ్చిన కాక్ ట్రైనింగ్ సెంటర్‌ల వారితోనే శిక్షణ ఇప్పించేందుకు ప్రయత్నిస్తుంటారు. వంశపారం పర్యంగా ఈ వృత్తిలో కొనసాగుతున్నా వారు, గతంలో రాజుల కోటల్లో ఇలాంటి శిక్షణ ఇచ్చిన కుటుంబాలకు చెందినవారినే ఎంచుకుంటున్నారు. అలాంటి వారినీ కోళ్లకు శిక్షణ ఇచ్చేందుకు నియమించుకుంటారు. హైదరాబాద్ బార్కాస్‌లో పహిల్వాన్‌ల వద్ద తర్ఫీదు పొందిన పుంజులను కొందరు తెచ్చుకుని పోటీలో దింపుతుంటారు. మరికొందరు ఆ పహిల్వాన్ వద్ద శిక్షణ పొందిన వారిని తీసుకువచ్చిన కోళ్లకు శిక్షణ ఇప్పిస్తుంటారు. కోనసీమలోని రావులపాలెం లాంటి ప్రాంతాల వారైతే కోల్‌కతా నుంచి నిపుణులను రప్పిస్తుంటారు. ఇలా శిక్షణ ఇచ్చేవారు ఒక్కొక్కరు 10 నుంచి 15 కోళ్లనే పర్యవేక్షస్తుంటారు. వీరికి నెలకు రూ.15,000 నుంచి 20,000 వేలు వరకు చెల్లిస్తుంటారు. సాధారణంగా శిక్షణ దసరా నుంచే మొదలుపెడతారు. ఈ షార్ట్ టర్మ్ కోర్సు బాగా పాపులర్. కొన్నిచోట్ల క్రాష్‌కోర్స్‌లాగా ఇంకా తక్కువ వ్యవధిలోను కూడా ఇస్తారు. మరికొన్ని కేంద్రాల్లో ఏడాది పొడవునా తర్ఫీదు ఇస్తుంటారు.

పందెం కోడి శిక్షణ తెల్లవారుజామున 5 గంటలకే మొదలవుతుంది. పందేనికి 60 రోజుల ముందు నుంచే డైట్ ప్రారంభిస్తారు. ప్రతిరోజూ ఉదయాన్నే డ్రైఫ్రూట్ లడ్డూ, ఖీమా, కొన్ని రకాల ఆకుకూరలను ఉడకబెట్టి వాటికి పెడుతుంటారు. గుడ్డు తెల్లసొన 40 రోజుల ముందు నుంచి పెడతారు.

రోజూ ఆరుబయట ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉంచుతారు. నడకతో పాటు కొన్ని రకాల కసరత్తులు చేయిస్తారు. ఇక సాయంత్రం 4 గంటలకు గింజమేత వేస్తారు. ఆ తర్వాత తెల్లవారే వరకు విశ్రాంతినిస్తారు. జనంలో ఉన్నప్పుడు భయపడకుండా ఉండేందుకు చేత్తో మేత పెడతారు. బెరుకును పోగొడతారు. చురుగ్గా ఉండేలా చేసేందుకు వారానికి కనీసం ఒకటి రెండుసార్లు నీటిలో ఈత కొట్టిస్తారు. రింగులో ఐదారు కోళ్లను వదిలేస్తారు. ఏది చివరి వరకూ ఉంటుందో చూస్తారు. మిగిలినవీ కూడా అలా ఉండేలా అలవాటు చేస్తారు. సంక్రాంతికి వారం ముందు నుంచి పందేనికి వెళ్లే వరకు కోడికి పూర్తిగా విశ్రాంతిని ఇస్తారు.

తర్ఫీదులో భాగంగా కోళ్లకు ఆయాసం (గస) రాకుండా, కొవ్వు పెరగకుండా, నరాలు ఫ్రీ అయ్యేందుకు నాలుగైదు రోజులకు ఒకసారి బి విటమిన్, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు, ఇంజక్షన్లు కూడా ఇస్తుంటారు. చలికాలం కావడంతో కోళ్లకు క్కొర వ్యాధి, కొరేగా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వంటివి రాకుండా నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. ఒకవేళ వస్తే గనక నియంత్రణ కోసం యాంటీబయాటిక్స్‌నూ వాడతారు. పోటీలో ఉన్నప్పుడు అవతలి కోడి పొడిచే కత్తిపోట్లు, కాలిగోటి దెబ్బలకు నొప్పి తెలియకుండా ఉండేందుకు పందెం శరీరాన్ని సిద్ధం చేసేందుకు నీళ్లపోతలు 'శాక'లు తీస్తారు. వీటితో కోళ్ల శరీరం గట్టి పడి, దెబ్బ తగిలినా నొప్పి తెలియక పోరాడుతూనే ఉంటాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా నీరుపోతలను చేస్తుంటారు. యూకలిప్టస్, వెదురు చెట్ల ఆకులు, జామాయిల్, కుంకుడు, తుమ్మ బెరడు, పసుపుకొమ్ములు, వంటి 15 నుంచి 20 రకాలను కలిపి నీటిలో మరిగిస్తారు. ఆ ద్రావణాన్ని చల్లార్చి గోరు వెచ్చగా ఉన్నప్పుడు అందులో కోడిని ముంచడం, లేదా కోడి పై పోయడం చేస్తుంటారు. 10 నుంచి 15 రోజులకు ఒకసారి ఇలా చేస్తుంటారు. పెనం లేదా మూకుడు వేడి చేసి దానిపై చీప్ లిక్కర్ పోస్తారు. వచ్చే ఆవిరిని వస్త్రంతో కోడి శరీరానికి అద్దుతారు. ఇలా చేసే విధానాన్నిశాక తీయడం అంటారు.

పందెంలో గెలవాలంటే కోడిని ఏ దిక్కు నుంచి బరిలోకి దించాలి, ఏ రోజు ఏ రకం కోడి పందెం కొడుతుంది, ఏ జాతి కోడి ఏ జాతి కోడితో సరిగా కలబడుతుంది. ఇలాంటి వాటన్నింటికీ లెక్కలు ఉంటాయి. దీన్ని 'కుక్కుటశాస్త్రం' చూసి నిర్ణయిస్తుంటారని చెబుతుంటారు. ఈ శాస్త్ర ప్రకారం వారాలు, పక్షల ప్రకారం కొన్ని జాతుల కోడి పుంజుల జీర్ణశక్తి మందగించే రోజులు ఏవో గుర్తిస్తుంటారు. అలాంటి సమయంలో వాటిని బరిలోకి దింపితే ఓడిపోతాయంటుంటారు. ఉభయగోదావరి జిల్లాల్లో కోడి పందేలను ఆరంభించే ముందు ఈ కుక్కుటశాస్త్రాన్ని చదువుతుంటారు.

పందేల్లో కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి బరిలోకి దింపుతుంటారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఉన్న తదితర ప్రాంతాల్లో కత్తి కట్టకుండానే పందేనికి సై అంటారు. కోడి కాళ్లకు సహజంగా పెరిగే 'కాటా'నే ఈ పోటీలకు ఆయుధంగా నిర్వహిస్తుంటారు. కాటాలు పెరుగుతున్నప్పుడు వాటిని షేప్ చేస్తారు. బరిలోకి దింపే సమయానికి దాన్ని మరింత మొనదేలుస్తారు. ఆ కాటాతోనే ఎదుటి కోడిపై దాడి చేసి దెబ్బతీయాలి కాబట్టి ఈ పోటీ చాలాసేపు సాగుతుంది. నెమలి, కాకి, డేగ, సవల, ముంగిస, కొక్కిరాయి. ఇలా పలు రకాల జాతుల కోళ్లతో పందేలు వేస్తుంటారు. వీటిని పందేలకు సిద్ధం చేసేందుకు భారీ స్థాయిలో కేంద్రాలు వెలిశాయి. భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల్లోనే 200కు పైగా, ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఉన్న పరిసర ప్రాంతాల్లో 150 వరకు నాటుకోళ్ల కాక్ ట్రైనింగ్ కేంద్రాలు లేదా పెంపకం కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోను కూడా సుమారు 200 వరకు శిక్షణ కేంద్రాలు ఉన్నాయి.

# పోలీస్ సర్కిళ్ల విభజన జరిగేనా?



**చిత్తూరు, పతాకం న్యూస్:** చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంత నియోజకవర్గాలలో గల అన్ని గ్రామాలకు 6వేల కోట్లను ఖర్చు చేసి శుద్ధ జలాలను ఇంటింటికి అందించినట్లు పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో (పీ ఎం ఏ వై) ప్రధాన మంత్రి అవాస్ యోజన పథకం ద్వారా నియోజకవర్గంలోని (బైరెడ్డిపల్లికి చెందిన 59 మందికి, గంగవరం మండలం లోని 80 మందికి, పలమనేరు రూరల్ నందు 57 మందికి, పెద్దపంజాణి మండలానికి చెందిన 99 మందికి, వి.కోట మండలంలోని 8 మందికి అదేవిదంగా పలమనేరు అర్బన్ పరిధిలోని 108 మందితో కలిపి మొత్తం) 411 మంది లబ్ధిదారులకు ఇంటి మంజూరు పత్రాలను బుధవారం ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలతోపాటు గృహ నిర్మాణాలకు ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందిస్తాయన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఇళ్లను నిర్మించుకోలేకపోయారని అయితే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 2.89 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జగన్ అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. నేడు పెట్టుబడిదారులను ఆకర్షించి రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని దేశంలోని 25 శాతం పెట్టుబడులు రాష్ట్రానికి రావడానికి చంద్రబాబు ప్రధాన కారణమని వివరించారు. ఆదాయం పెరిగితే పేదలకు మరింత మంచి చేసేందుకు వీలుంటుందని తెలిపారు. ఇక శాశ్వత సాగు, తాగు నీటి పరిష్కారానికై కూటమి ప్రభుత్వం కఅషిచేస్తోందని అందులో భాగంగా చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతాలకు గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని వచ్చే ఏడాది తీసుకొచ్చి ప్రతి ఇంటికి శుద్ధ జలాలను అందించనున్నామని పేర్కొన్నారు. ఇంటి మంజూరు పత్రాలను పొందిన లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి, హౌసింగ్ డీఈ రాములు, మెప్మా అధికారి బాబా, పలమనేరు బాలాజీ కోపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ, నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం గౌడ్,కుట్టి, సోమశేఖర్ గౌడ్,నాగరాజు రెడ్డి, సుబ్రహ్మణ్యం శెట్టి,ఖాజా, గణేష్, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి, రోజా రెడ్డి, గిరిబాబు, ప్రసాద్ నాయుడు, నాగరాజులతో పాటు జనసేన నాయకులు దిలీప్ కుమార్ తదితరులున్నారు.

# గుండె ఆరోగ్యంగా ఉండాలంటే..



పని చేసినంత వరకూ గుండె గురించి పెద్దగా పట్టించుకోం. ఎప్పుడైనా సమస్య వచ్చినప్పుడు 'ముందే జాగ్రత్త పడితే బాగుండేది కదా' అని చింతిస్తాం. అందుకే, పరిస్థితి అంత వరకూ రాకుండా ముందే మేల్కోవాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గుండెకు మేలు చేసే డైట్‌ల గురించి తెలుసుకొని, పాటిస్తే మేలని చెబుతున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు లేదా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకునే వారు డైట్ పాటిస్తారు. కానీ, గుండె ఆరోగ్యం కోసం కొన్ని రకాల డైట్ చేయవచ్చంటున్నారు నిపుణులు. అలాగే, గుండె ఆరోగ్యం కోసం పండ్ల రసాలు, ఆకుకూరలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు, విత్తనాలు, కొవ్వు కలిగిన చేపలతో కూడిన ఆహారంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో సోడియం, చక్కెర, సంతృప్త కొవ్వులు, ప్రాసెస్ చేసిన ఆహారాలను పరిమితం చేసుకోవాలంటున్నారు నిపుణులు.

మెడిటరేనియన్ డైట్ అనేది మధ్యధరా సముద్ర తీర దేశాలైన గ్రీస్, ఇటలీ, స్పెయిన్ ప్రజల సంప్రదాయ ఆహారపు అలవాట్లపై ఆధారపడిన ఒక ఆరోగ్యకరమైన జీవనశైలి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఆరోగ్యకరమైన ఆహార విధానాలలో ఒకటిగా గుర్తించబడింది. ఈ డైట్ గుండెకు చాలా మేలు చేస్తుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, చేపలను ఎక్కువగా తీసుకుంటారు. అంతేకాదు, ఆలివ్ ఆయిల్‌ని వాడతారు. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుందంటున్నారు నిపుణులు. మెడిటరేనియన్ డైట్ పాటించే వ్యక్తులకు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలు, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తక్కువగా ఉన్నాయని సర్వేలో తేలింది.

ఈ డైట్‌లో 'ఏం తినాలి' అనే దానికంటే, 'ఎప్పుడు తినాలి' అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఇందులో రోజంతా నిర్ణీత గంటల పాటు ఉపవాసం ఉండి, మిగిలిన సమయంలో మాత్రమే ఆహారం తీసుకోవడం జరుగుతుంది. ఇది ఊబకాయం, రక్తపోటు, టైప్ 2 డయాబెటిస్‌ను అదుపులో ఉంచుతుందని చెబుతున్నారు. అయితే, దీనిని అనుసరించే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

ఆరోగ్యకరమైన, సమతులాహారం అంటే మన శరీరానికి కావలసిన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు సరైన నిష్పత్తిలో ఉంటాయి. ఇందులో తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు అనేవి రక్త ప్రసరణను మెరుగుపరచడంతో పాటు బరువును నియంత్రణలో ఉంచుతాయి.

ముఖ్యంగా రక్తపోటును తగ్గించడానికి రూపొందించిన ఒక శాస్త్రీయ ఆహార విధానం. ఇది 2026లో కూడా ప్రపంచవ్యాప్తంగా గుండె ఆరోగ్యానికి అత్యుత్తమ డైట్‌లలో ఒకటిగా పరిగణిస్తున్నారు. ఈ డైట్ పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడానికి, గుండెను ఆరోగ్యంగా ఉంచడానికి రూపొందించబడింది. ఆహారం హృదయ, జీవక్రియ ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి స్థూల పోషకాలు, సూక్ష్మపోషకాల సమతులాహారం అందిస్తుందని చీఫ్‌ఱశీఱుశ్రీ నాఱఎత్తుఱతీఃశీట వీవఃఱఖఱఅఱ అధ్యయనం పేర్కొంది. తృణధాన్యాలు, తక్కువ గ్లైసెమిక్ పండ్లు, ఆకుకూరలు, చిక్కుళ్లు నుంచి సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఫైబర్, అవసరమైన సూక్ష్మపోషకాలను సరఫరా చేస్తాయని తెలిపింది.

దీనినే 'శిలాజ యుగం నాటి ఆహారం' అని కూడా అంటారు. మన పూర్వీకులు వ్యవసాయం ప్రారంభించకముందు, అంటే సుమారు 10,000 ఏళ్ల క్రితం వేటాడటం లేదా అడవుల దొరికే పండ్లను మాత్రమే తినేవారు. ఈ పద్ధతినే పాలియో డైట్ అని పిలుస్తారు. ఆధునిక పాలియో డైట్‌లో పండ్లు, కూరగాయలు, లీన్ మాంసాలు, చేపలు, గుడ్లు, గింజలు, విత్తనాలు ఉంటాయని ఖఎఃశిఃశ్రీఅఱఉఃఇ అధ్యయనం పేర్కొంది.

ఈ డైట్‌లో మొక్కల నుంచి లభించే ఆహార పదార్థాలపై ఆధారపడే జీవనశైలి. ఇది కేవలం శాకాహారం మాత్రమే కాదు, ఇందులో జంతు సంబంధిత ఆహారాన్ని కూడా తీసుకోవచ్చు. కానీ, ఈ డైట్‌లో 70-80% మొక్కల నుంచి లభించే ఆహారం మాత్రమే తీసుకోవాలి. తద్వారా రక్తపోటు, కొలెస్ట్రాల్ అదుపులో ఉండి గుండె జబ్బుల ముప్పు తగ్గుతుందంటున్నారు నిపుణులు.

ఇది శరీరంలో దీర్ఘకాలిక వాపు లేదా మంటను తగ్గించే ఆహార నియమావళి. ఈ డైట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారాలు గుండె వాపును తగ్గించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఈ డైట్‌లు రెండూ పిండి పదార్థాలను తగ్గించి, శరీరానికి అవసరమైన శక్తిని కొవ్వుల నుంచి పొందేలా చేస్తాయి. 2026 నాటికి బరువు తగ్గడానికి ఇవి ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతులు. అంతేకాదు, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడానికి సహాయపడతాయి. రక్తపోటు కూడా అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు

ఉప్పును తగ్గించి, పొటాషియం ఎక్కువగా ఉండే చిలగడదుంపలు, టమోటాలు వంటివి తీసుకోవడం వల్ల గుండె, ధమనులపై ఒత్తిడి తగ్గుతుందట.

ఇది పూర్తిగా శాకాహారం తీసుకుంటూనే, అప్పుడప్పుడు లేదా మితంగా మాంసాహారాన్ని అనుమతించే ఒక సౌకర్యవంతమైన ఆహార విధానం. దీనిని 2026లో అత్యంత సులభంగా పాటించదగ్గ, సమతులమైన డైట్‌లలో ఒకటిగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇది బరువు తగ్గడానికి, గుండె జబ్బులు, క్యాన్సర్, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుందంటున్నారు.

# 'ఉల్లిపాయ నూనె'తో జుట్టుకు పోషణ, అందం





జీవనశైలి, ఆహార అలవాట్లు, పని ఒత్తిడి, కాలుష్యం, వాతావరణ మార్పులు.. ఇలా ఎన్నో కారణాలతోపాటు తెలియకుండానే చేసే కొన్ని పొరపాట్ల వల్ల కూడా జుట్టు రాలిపోతూ ఉంటుంది. పొడిబారిపోవడం, నెరిసిపోవడం, చుండ్రు ఇలా పలు రకాల సమస్యలు వేధిస్తుంటాయి. దీంతో.. వీటిని తగ్గించుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు మార్కెట్లో దొరికే ప్రొడక్ట్స్ వాడితే.. మరికొందరు నేచురల్ ఉత్పత్తులు వాడుతుంటారు. అయితే.. నిపుణులు ఓ సజెస్ట్ చేస్తున్నారు. అదే "ఉల్లిపాయ నూనె". మరి, దీని ఉపయోగాలేంటి? అసలు దీన్ని ఎలా తయారుచేసుకోవాలి? అన్నది ఇప్పుడు తెలుసుకుందాం! ముందుగా మీడియం సైజ్ ఉల్లిపాయలపై పొట్టు తొలగించి పెద్ద పెద్ద ముక్కలుగా చేసుకోవాలి. వీటిని మిక్సీ జార్‌లో వేసి పేస్ట్‌లా చేసుకోవాలి. కావాలంటే కొద్దిగా కొబ్బరి నూనెను వేసుకోవచ్చు.

ఇప్పుడు స్టౌ మీద ప్యాన్ పెట్టి, అందులో ఉల్లిపాయ పేస్ట్ మిగతా కొబ్బరి నూనె, నువ్వుల నూనె వేసి బాగా కలుపుకోవాలి. పెద్ద మంట పైన పెట్టి ఒక పొంగు వచ్చాక, సిమ్ చేసి 30 నిమిషాల పాటు మరిగించుకోవాలి. దీంతో ఉల్లిపాయలోకి సుగుణాలన్నీ నూనెలోకి చేరతాయి. ఆ తర్వాత స్టౌ ఆఫ్ చేసి నూనె చల్లబడే దాకా పక్కన పెట్టేసుకోవాలి.

తర్వాత ఒక శుభ్రమైన క్లాత్ సహాయంతో ఈ నూనెను గాలి చొరబడని డబ్బాలోకి వడ కట్టుకొని ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఈ నూనెను మూడు నుంచి నాలుగు నెలల పాటు ఉప యోగించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఉల్లిపాయలో ఉండే పోషకాలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కురులను ఆరోగ్యంగా ఉంచటంతో పాటు జుట్టును ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుంచి కూడా రక్షిస్తాయని సర్వే తెలిపింది. ఈ క్రమంలో ఉల్లిపాయ నూనెను కుదుళ్లపై వేసి మునివేళ్లతో గుండ్రంగా తిప్పుతూ మర్దన చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల కుదుళ్లలో రక్తప్రసరణ మెరుగవుతుందని, నూనెలోని పోషకాలు కుదుళ్లలోకి ఇంకుతాయని చెబుతున్నారు. ఫలితంగా, కుదుళ్లు దృఢమై జుట్టు రాలే సమస్య తగ్గుముఖం పడుతుందంటున్నారు. అంతేకాకుండా, ఉల్లిపాయలో అధికంగా ఉండే సల్ఫర్ జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుందని తెలియజేస్తున్నారు. కుదుళ్లు పొడిబారిపోవడం, అక్కడి చర్మం ప్యాచుల్లాగా రాలిపోవడం, చుండ్రు వంటి సమస్యలతో చాలా మంది బాధపడుతుంటారు. వీటి నుంచి విముక్తి పొందడానికి ఉల్లిపాయ నూనె మంచిదని చెబుతున్నారు. ఈ నూనెలోని బయోయాక్టివ్ సమ్మేళనాలు కుదుళ్ల సమస్యల్ని తగ్గించి జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయంటున్నారు.

అంతేకా కుండా, ఉల్లిపాయ నూనె క్యారియర్ ఆయిల్‌లా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ఏదైనా అత్యవసర నూనె వాడాలనుకున్నప్పుడు దాన్ని ఈ నూనెలో చేర్చుకొని ఉపయోగిస్తే, రెండు నూనెల్లోని సుగుణాలు కుదుళ్లకు, జుట్టుకు సంపూర్ణంగా అందుతాయని పేర్కొంటున్నారు.

అలాగే, ఉల్లిపాయ నూనె జుట్టుకు కండిషనర్‌లా కూడా ఉపయోగపడుతుందని, రోజూ ఈ నూనెతో మర్దన చేసుకుంటే కేశాలు పొడిబారిపోవడం, నిర్జీవమైపోవడం, గడ్డిలా మారిపోవడం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని తెలియజేస్తున్నారు.

# రాయలసీమకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నావు..?: పవన్ ను నిలదీసిన రోజా



**నెల్లూరు, పతాకం న్యూస్:** కూటమి పాలనలో రాయలసీమ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని వైసీపీ నేత, ఏపీ మాజీ మంత్రి రోజా ఆరోపించారు. ఉదయం నెల్లూరు జిల్లా జైలులో పిన్నెల్లి సోదరులను రోజా పరామర్శించారు. అనంతరం, ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మొన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం చూశాం... రాయలసీమ ద్రోహులు ఎవరో ఆయన మాటలతోనే స్పష్టమైందని రోజా అన్నారు. సీఎం చంద్రబాబు రాయలసీమను మోసం చేస్తున్నాడని ఓటుకు నోటు కేసులో ఆయన పార్టనరే చెబుతున్నాడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు రాష్ట్ర విభజనకు సంతకం చేసి నాశనం చేశావు... ఇవాళ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపివేయించి అన్యాయం చేస్తున్నావు అని రోజా మండిపడ్డారు. హైదరాబాద్ లోని మీ ఆస్తులు కాపాడుకోవడానికి రాయలసీమను ఎలా తాకట్టు పెడతారని విమర్శించారు. రాయలసీమ అంటే ప్రాణమని చెప్పే పవన్ కల్యాణ్, రాయలసీమకు ఇంత అన్యాయం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని రోజా నిలదీశారు. 'ఇందుకేనా నువ్వు పార్టీ పెట్టింది.. ఇందుకేనా కూటమిలో చేరింది.. ఇందుకేనా చంద్రబాబును గెలిపించింది' అంటూ పవన్ కల్యాణ్ పై రోజా తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రభుత్వ అధికారులు సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు భజన బ్యాచ్ లా తయారయ్యారని రోజా మండిపడ్డారు. పిన్నెల్లి సోదరులపై కక్షగట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఖాకీ చొక్కాలు వేసుకోవాల్సిన పోలీసులు పసుపు చొక్కాలు ధరిస్తున్నారని విమర్శించారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ పిన్నెల్లి సోదరులకు భోజనం పెట్టడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇంతకు పదింతలు చెల్లించుకుంటారని అధికారులను బెదిరించారు.

# పర్యాటకులకు సరికొత్త అనుభూతి

## లంబసింగిలో 15 జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్లు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్ర కశ్మీర్ లంబసింగిలో పర్యాటకులకు సరికొత్త అనుభూతి కలగనుంది. ఎత్తైన కొండపైన ప్రకృతిని ఆస్వాదిస్తూ బస చేసేందుకు అనువుగా సరికొత్త జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్లను ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఏర్పాటు చేస్తున్నది. లంబసింగిలో పర్యాటకాభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటకులకు అదనపు సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం రూ.5.33 కోట్లు విడుదల చేయడంతో కేరళ తరహాలో పర్యాటకులకు ప్రకృతి ఒడిలో విడిది కల్పించేందుకు 15 జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్ల ఏర్పాటు పనులను ఏపీటీడీసీ ప్రారంభించింది. నాలుగు నెలల్లో ఈ టెంట్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పర్యాటక శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్ర కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. శీతాకాలం సీజన్‌లో లక్షల్లో పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకులు బస చేసేందుకు ఏపీటీడీసీకి చెందిన హరిత రిసార్ట్స్ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుతం హరిత రిసార్ట్స్‌లో ఎనిమిది సూట్లు, మూడు డీలక్స్, నాలుగు నాన్ ఏసీ టెంట్లు, కాన్ఫరెన్స్ హాల్, రెస్టారెంట్ అందుబాటులో ఉన్నాయి. హరిత రిసార్ట్స్‌లో గదులకు భారీ డిమాండ్ ఉంది. లంబసింగిలో ప్రైవేటు రిసార్ట్స్ అందుబాటులో ఉన్నప్పటికి పూర్తి స్థాయి సదుపాయాలు లేవు. దీంతో ఏపీటీడీసీ రిసార్ట్స్ గదులు లభించని పర్యాటకులు ప్రైవేటు రిసార్ట్స్‌లో బస చేస్తున్నారు. మెజారిటీ పర్యాటకులు నర్సీపట్నంలో బస చేసి తెల్లవారుజామున నాలుగు గంటలకు వ్యక్తిగత, ప్రైవేటు వాహనాల్లో లంబసింగి చేరుకుంటున్నారు. గతంతో పోల్చుకుంటే లంబసింగిని సందర్శించే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లంబసింగిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం మరో నాలుగు నెలల్లో సందర్శకులకు అందుబాటులోకి వస్తుంది. దీంతో లంబసింగిని ఏడాది పొడవునా పర్యాటకులు సందర్శించే అవకాశం ఉంది. 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం లంబసింగిలో పర్యాటకులకు వసతి కల్పించేందుకు ప్రప్రథమంగా రూ.5 కోట్లు మంజూరు చేసింది. అదే ఏడాది రెవెన్యూ అధికారులు లంబసింగి- లబ్బంగి ప్రధాన రహదారిలో 18 ఎకరాల స్థలాన్ని రిసార్ట్స్ నిర్మాణాలకు కేటాయించారు. ఏపీటీడీసీ.. రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలంలో 40 రిసార్ట్స్ నిర్మాణాలకు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే తొలి విడతగా మంజూరైన రూ.5 కోట్లతో 12 రిసార్ట్స్, ఒక మెయిన్ బ్లాక్(కాన్ఫరెన్స్, వెయిటింగ్, ఓపెన్ ఏరియా, రెస్టారెంట్) నిర్మాణాలకు పర్యాటకశాఖ పనులు ప్రారంభించింది. 2019 మార్చి నాటికి మెయిన్ బ్లాక్(జీ ప్లస్ టూ) 70 శాతం నిర్మాణాలు పూర్తి చేశారు. నాలుగు రిసార్ట్స్ నిర్మాణాలు 80 శాతం పూర్తి చేశారు. అనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో రిసార్ట్స్ నిర్మాణాలకు బ్రేక్ పడింది. దీంతో ఏపీటీడీసీ బ్యాంక్ రుణాల ద్వారా నిధులను సమీకరించుకుని 2022 డిసెంబరు నాటికి రిసార్ట్స్ నిర్మాణాలను పూర్తి చేసింది.

స్వదేశీ దర్శన్ పథకం ద్వారా అరకులోయ, లంబసింగి రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అలాగే హరిత రిసార్ట్స్‌లో పర్యాటకులకు అదనపు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. లంబసింగిలో ప్రకృతికి హాని కలగకుండా జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్లు నిర్మించనున్నారు. ఈ టెంట్లలో బస చేసే పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. మంచు అందాలు, ప్రకృతిని ఆస్వాదిస్తూ బస చేసేందుకు అనువుగా ఇది ఉంటుంది. లంబసింగి హరిత రిసార్ట్స్ కొండపైన సువిశాలంగా 15 జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్ల నిర్మాణానికి ఏపీటీడీసీ ప్రతిపాదనలు పంపించిన నెల రోజుల్లోనే కూటమి ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. దీంతో ఏపీటీడీసీ అధికారులు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ జియోడెసిక్ డోమ్ గ్లాంపింగ్ టెంట్లు గ్లోబ్ ఆకారంలో ఉంటాయి. ఒక్కొక్క టెంట్‌ను 725 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. మిగతా ప్రాంతంలో పిల్లలు ఆడుకునేందుకు ఓపెన్ ఏరియా ఉంటుంది. సందర్శకులు విహరించేందుకు ఆరు సీట్ల ఈవీ బుగ్గీలు రెండు అందుబాటులో ఉంచుతారు. ప్రతి టెంట్‌లో 7/6 బెడ్, రాకింగ్ చైర్, 3/3 సైడ్ టేబుళ్లు, వార్డ్‌రోబ్, లగేజ్ ర్యాక్, డ్రెస్సింగ్ టేబుల్, నాలుగు కుర్చీలతో కూడిన కాఫీ టేబుల్, తదితర సదుపాయాలు ఉంటాయి.




## న్యూజిలాండ్ సిరీస్‌లో..

# రికార్డులపై రోహిత్ శర్మ, గిల్ గురి



కొత్త ఏడాదిలో టీమ్ఇండియా మరో ఆసక్తికరమైన సమరానికి సిద్ధమైంది. న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కేవలం గెలుపు ఓటముల కోసమే కాదు, వ్యక్తిగత రికార్డుల పరంగా కూడా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మైదానంలో పరుగుల వరద పారించడం ఒక ఎత్తయితే, క్రికెట్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకోవడం మరొక ఎత్తు. సరిగ్గా ఇప్పుడు ఇద్దరు భారత స్టార్ ప్లేయర్స్ అలాంటి అరుదైన రికార్డ్‌లకు అతి చేరువలో ఉన్నారు. ఇంతకీ ఆ రికార్డులేంటి? ఎవరి రికార్డులు గల్లంతు కాబోతున్నాయి? అనే వివరాల్లోకి వెళితే!

సాధారణంగా రికార్డులు అంటే సెంచరీలు, హాఫ్ సెంచరీల గురించి మాట్లాడుకుంటాం. కానీ ఈసారి బద్దలు కాబోయేది 'ఆల్ టైమ్ గ్రేట్ల రికార్డులు. ప్రపంచ క్రికెట్?లో ఒకప్పుడు బౌలర్లకు చుక్కలు చూపించిన సౌతాఫ్రికా, పాకిస్థాన్ దిగ్గజాలను మనోడు వెనక్కి నెట్టడానికి రంగం సిద్ధమైంది. అలాగే పరుగుల వేటలోనూ కొత్త బెంచ్ మార్క్ సెట్ చేయడానికి మరొకరు రెడీ అయ్యారు. ఈ గణాంకాలు చూస్తుంటే ఈ సిరీస్?లో మన బ్యాటర్ల విశ్వరూపం చూడటం ఖాయం అనిపిస్తోంది. కొన్ని ఏళ్లుగా పదిలంగా ఉన్న రికార్డులు ఈ సిరీస్‌తో కనుమరుగు కానున్నాయి.

ఆ రికార్డుల రారాజు మరెవరో కాదు, మన కెప్టెన్ రోహిత్ శర్మ. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన వారి జాబితాలో ప్రస్తుతం రోహిత్ 9వ స్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు 279 మ్యాచ్‌లాడిన రోహిత్, 11,516 పరుగులు సాధించాడు. ఇప్పుడు సౌతాఫ్రికా దిగ్గజం జ్యాక్ కలిస్ (11,579) రికార్డును దాటడానికి రోహిత్?కు కావాల్సింది కేవలం 64 పరుగులు మాత్రమే. అది దాటితే 8వ స్థానానికి చేరుకుంటాడు. అంతటితో ఆగకుండా, ఈ సిరీస్?లో మరో 224 పరుగులు చేస్తే పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ (11,739) ను కూడా వెనక్కి నెట్టి ఏకంగా 7వ స్థానానికి ఎగబాకే అవకాశం ఉంది. సచిన్, కోహ్లీ తర్వాత ఆ జాబితాలో టాప్ ప్లేస్?లోకి వెళ్లే గోల్డెన్ ఛాన్స్ ఇది.

మరోవైపు యువ సంచలనం శుభ్‌మన్ గిల్ కూడా అరుదైన ఫీట్‌కు చేరువలో ఉన్నాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 3,000 పరుగులు పూర్తి చేసిన రెండో క్రికెటర్ గా రికార్డు సృష్టించే అవకాశం గిల్ ముందుంది. ప్రస్తుతం గిల్ 58 ఇన్నింగ్స్?ల్లో 2,818 పరుగులు చేశాడు. 3 వేల మార్క్ అందుకోవడానికి అతనికి ఇంకా 182 పరుగులు కావాలి. ప్రపంచ రికార్డు ప్రకారం హాషిమ్ ఆమ్లా 57 ఇన్నింగ్స్ ల్లోనే ఈ ఘనత సాధించి టాప్?లో ఉన్నాడు. గిల్ ఇప్పటికే 58 ఇన్నింగ్స్?లు ఆడాడు కాబట్టి ఫస్ట్ ప్లేస్ మిస్ అయినా, షై హోప్ (67), ఫఖర్ జమాన్ (67), బాబర్ ఆజం (68) వంటి వారిని వెనక్కి నెట్టి రెండో స్థానాన్ని దక్కించుకునే అవకాశం పుష్కలంగా ఉంది.

## వైభవ్ సూర్యవంశీ విధ్వంసక శతకం.. కేవలం 63 బంతుల్లోనే సెంచరీ



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న యూత్ వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత జట్టు, క్లీన్‌స్వీప్ లక్ష్యంగా ఆడుతున్న మూడో, చివరి వన్డేలోనూ దుమ్మురేపుతోంది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ వైభవ్ కేవలం 63 బంతుల్లోనే విధ్వంసక శతకం బాదాడు.

తన ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 8 సిక్సర్లు కొట్టిన వైభవ్.. దక్షణాఫ్రికా బౌలర్లకు చుక్కలు చూపించాడు. మొత్తంగా 127 రఅబశ్రీశ్రీన్స్ చేసి ఔటఅబశ్రీశ్రీయ్యాడు. మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ కూడా రాణిస్తుండటంతో భారత్ వికెట్ నష్టపోకుండా పటిష్ఠఅబశ్రీశ్రీ స్థితిలో ఉంది. గత మ్యాచ్‌లోనూ వైభవ్ ఇదే తరహాలో చెలరేగిన విషయం తెలిసిందే.

వర్షం కారణంగా కుదించిన ఆ మ్యాచ్‌లో వైభవ్ కేవలం 24 బంతుల్లో 10 సిక్సర్లతో 68 పరుగులు చేసి ఒంటిచేత్తో జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో బౌలర్లు కూడా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ కిషన్ సింగ్ 4 వికెట్లు పడగొట్టగా, దక్షణాఫ్రికా తరఫున జాసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడాడు.

ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా, బ్యాటర్‌గా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్నాడు. మూడో మ్యాచ్‌లోనూ సెంచరీతో చెలరేగి, 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసే దిశగా జట్టును నడిపిస్తున్నాడు.




# 'మన శంకరవరప్రసాద్ గారు'

## ప్రీమియర్స్‌కు ఓవర్సీస్ లో ప్రభంజనం.. 10,000కు పైగా టిక్కెట్ల విక్రయం



అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న చిత్రం


మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం విడుదల కాకముందే ఓవర్సీస్‌లో సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా యూకేలో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పింది. విడుదలకి ఇంకా వారం రోజులు సమయం ఉండగానే, అప్పుడే 10,000కు పైగా టికెట్లు అమ్ముడవడంతో మెగాస్టార్ క్రేజ్ మరోసారి రుజువైంది.

సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. ఇందులో విక్టరీ వెంటేశ్ ఓ కీలక పాత్రల కనిపించనున్నారు. చిరంజీవి వింటేజ్ లుక్, వెంకటేశ్ మార్క్ కామెడీ ఈ సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. యూకేలో ఒక రోజు ముందుగానే, అంటే జనవరి 11న గ్రాండ్ ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు.

ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార కథనాయికగా నటించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. అహింసా ఫిల్మ్స్, సరిగమ సినిమాస్, బోలిన్ సినిమా (ఖఖ) కలిసి ఈ చిత్రాన్ని యూకేలో భారీ ఎత్తున విడుదల చేస్తున్నాయి. ఈ సంక్రాంతికి ఇది అతిపెద్ద ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# మార్చి 27న థియేటర్స్‌కు రానున్న రామ్‌చరణ్ 'పెద్ది'

ఏఆర్ రెహమాన్ 59వ పుట్టిన రోజు సందర్భంగా రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని విడుదల చేసింది. ఉప్పెన ఫేం బుచిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం విడుదల వాయిదా పడిందని కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజా పోస్టర్ ద్వారా చిత్ర బృందం ఈ వార్తలకి పుల్‌స్టాప్ పెట్టింది. మార్చి 27, 2026న రామ్ చరణ్ బర్త్‌డే సందర్భంగా ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ ఉంటుందని ప్రకటించింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, కన్నడ నటుడు శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంట్ చేస్తున్నాయి.



# 'జన నాయగన్' చిత్రానికి ఇంకా రాని సెన్సార్ సర్టిఫికెట్

## మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన నిర్మాతలు

తమిళ సూపర్‌స్టార్ విజయ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. త్వరలో తమిళనాడుకు జరుగుతున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు. మరోవైపు సినిమాల నుంచి తాను వైదొలుగుతున్నట్టు ఇప్పటికే విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో, విజయ్ చివరి చిత్రం 'జన నాయగన్ణ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ నెల 9న సినిమా విడుదల కావాల్సి ఉంది. కానీ ఇప్పుడు రిలీజ్‌పై పెద్ద అనుమానాలు రేగాయి. సెన్సార్ బోర్డు నుంచి ఇంకా సెన్సార్ సర్టిఫైట్ రాకపోవడమే దీనికి కారణం. రిలీజ్‌కి కేవలం 3 రోజులే ఉన్న తరుణంలో ఈ జాప్యం కోలీవుడ్‌లో సంచలనం రేపింది. విజయ్ అభిమానులు తీవ్ర ఉత్కంఠలో ఉన్నారు.



డిసెంబర్ 18న సినిమాను సెన్సార్ బోర్డుకు సమర్పించారు. బోర్డు కొన్ని మైనర్ కట్స్, డైలాగ్ మ్యూట్లు సజెస్ట్ చేసింది. నిర్మాతలు వెంటనే అంగీకరించి మార్పులు చేసి మళ్లీ సబ్మిట్ చేశారు. అయినా సర్టిఫైట్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. దీని వెనుక రాజకీయ కారణాలు ఉండవచ్చని విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం వర్గాలు ఆరోపిస్తున్నాయి. డిప్యూటీ జనరల్ సెక్రటరీ సీటీ నిర్మల్ కుమార్ మాట్లాడితే... "కొన్ని గంటల్లో సర్టిఫైట్ రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం" అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ జాప్యం వల్ల తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ నిలిచిపోయాయి. కర్ణాటక, కేరళ, ఓవర్సీస్‌లో మాత్రం బుకింగ్స్ స్టార్ట్ అయ్యాయి. ఇప్పటికే ప్రీ-సేల్స్ రూ.35 కోట్లు దాటాయి. సర్టిఫికేట్ లేకపోతే థియేటర్లలో షోలు పడవు. నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుంది.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**